





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 275 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 24-1 -2026 పేజీలు-8 | వెల: రూ. 5.00


## జనగణనకు కేంద్రం రంగం సిద్ధం

- 33 ప్రశ్నలతో వివరాల సేకరణ
- గెజిట్ విడుదల చేసిన సర్కార్



**న్యూఢిల్లీ, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశ వ్యాప్తంగా జనగణనకు రంగం సిద్ధమైంది. రెండు దశల్లో జనగణన చేపట్టాలని ఇప్పటికే కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జనగణనలోనే కులగణన కూడా కేంద్రం చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి తొలిదశ జనగణన ప్రారంభం కానుంది. తొలిదశలో గృహ గణన కోసం కేంద్ర హోం శాఖ ప్రశ్నావళిని రూపొందించింది. 33 ప్రశ్నలతో మోదీ సర్కార్ గెజిట్ విడుదల చేసింది. ఇంటి వివరాలతో పాటు ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వాడకం, వాహన

-మిగతా 2 లో

## ఇరాన్‌పై అమెరికా యుద్ధ సన్నాహాలు



- మోహరిస్తున్న యూఎస్ సైన్యం
- యురేనియం శుద్ధి మొదలుపెడితే దాడి : ట్రంప్
- మా వేలు ట్రిగ్గర్‌పైనే : ఇరాన్

**టెహ్రాన్ జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మధ్యప్రాచ్యంలో యుద్ధ ఛాయలు అలుముకుంటున్నాయి. వెనిజులాపై దురాక్రమణకు పాల్పడటమే కాదు. ఆ దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన ట్రంప్ తన ఆధిపత్యం చెలాయించటానికి సిద్ధ మవుతున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. వెనిజులా డ్రగ్స్ సరఫరా చేస్తున్నదంటూ..అక్కడి చమురు నిక్షేపాలపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు..ఇపుడు ఇరాన్ యురేనియం శుద్ధి మొదలుపెడితే దాడి చేస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారు. దీంతో అమెరికా

-మిగతా 2 లో



## ఏడు గంటలు కేటీఆర్ విచారణ

- కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లు, ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ ఆరా
- కొన్నింటికి మాజీమంత్రి ఎదురు ప్రశ్నలు
- జూబ్లీహిల్స్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

**హైదరాబాద్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏడు గంటలకు పైగా సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కోట్లాది రూపాయలు సేకరించడం, ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ అంశాలపై సిట్ కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ సిట్ ఇచ్చిన నోటీసు మేరకు శుక్రవారం ఉదయం 10:50 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి కేటీఆర్ భారీ

-మిగతా 2 లో

# స్టూడెంట్‌గా సీఎం రేవంత్

### రేపటి నుంచి కెన్నడి స్కూల్‌లో క్లాసులకు హాజరు

- కెన్నడీ స్కూల్‌లో ఈనెల 30 వరకు స్పెషల్ క్లాసులు
- 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే ప్రత్యేక కోర్సులో చేరిన సీఎం
- ప్రత్యేక తరగతులు పూర్తయిన తర్వాత అక్కడి యూనివర్శిటీ నుంచి సీఎం సర్టిఫికెట్ అందుకుంటారు
- ఫిబ్రవరి 2న ఆయన హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు



**హైదరాబాద్/బోస్టన్ జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నిత్యం రాజకీయ వ్యూహాలు, ప్రజా సమస్యలు, సచివాలయ సమీక్షలతో క్షణం తీరిక లేకుండా గడిపే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇప్పుడు ఒక సరికొత్త పాత్రలో కనిపించబోతున్నారు. రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత తనదైన శైలిలో దూసుకుపోతున్న ఆయన, ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ కెన్నడీ స్కూల్ లో విద్యార్థిగా మారి పాఠాలు వినబోతున్నారు.

-మిగతా 2 లో



## మట్టి సాక్షిగా చెప్తున్నా నేను ఏ తప్పూ చేయలేదు

- ఇప్పుడు ఫోన్ల ట్యాపింగ్ జరగడం లేదా?
- నాతో సహా మంత్రులవీ ట్యాప్ చేస్తున్నారు
- డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీ, సీపీ సమాధానం చెప్పగలరా
- అక్రమ, అనైతిక పనులకు పాల్పడలేదు
- ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా
- రేవంత్‌రెడ్డి అవినీతి, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటాం
- నా వ్యక్తిత్వ హననం చేసిన వారినీ వదిలేది లేదు :
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్**
ఇప్పుడు రాష్ట్రంలో ఫోన్ల ట్యాపింగ్ జరగడం లేదని ఎవరైనా చెప్పగలరా?అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనతోపాటు మంత్రుల ఫోన్లు కూడా ట్యాప్ చేయిస్తున్నారని చెప్పారు. ఫోన్ల ట్యాపింగ్ జరగడం లేదని డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీ, హైదరాబాద్ సీపీ మీడియా ముఖంగా సమాధానం చెప్పగలరా?అని అడిగారు. నెహ్రూ కాలం నుంచి ఇప్పటి వరకు శాంతి భద్రతలు, దేశ భవిష్యత్తు కోసం నిఘా విభాగాలు ఆ పనిచేస్తాయని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సిట్ విచారణకు ముందు, ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో ఏమీ లేదన్నారు. కాలక్షేపం కోసమే విచారణ చేశారని అన్నారు. ఆరు గ్యారెంటీల మోసం, 420 హామీల దగా, సింగరేణి బొగ్గు కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడం కోసమే సిట్ విచారణ పేరుతో ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని విమర్శించారు. ఎన్ని సార్లు పిలిచినా విచారణకు వెళ్తామన్నారు. రూ.50 లక్షలతో నోటుకు ఓటు కేసులో దొరికిన దొంగ ఇప్పుడు ముఖ్యమంత్రి కావడం వల్లే ఈ రాజకీయ కక్ష సాధింపులు జరుగుతున్నాయని అన్నారు. నాలుగు కోట్ల ప్రజలను

-మిగతా 2 లో

## విద్య కన్నా గుట్కా పైనే ఎక్కువ ఖర్చు

- హెచ్‌సీఈఎస్ సర్వేలో వెల్లడి
- దేశంలో దాని వినియోగం నానాటికీ పెరుగుతున్నట్టు తాజా సర్వే వివరాలు వెల్లడి
- పొగాకు కోసం నాలుగు శాతం వినియోగిస్తుండగా.. విద్య కోసం మాత్రం కేవలం 2.5 శాతం మాత్రమే ఖర్చు



**న్యూఢిల్లీ**
పొగాకు వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రభుత్వాలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు రూపొందిస్తున్నా.. దేశంలో దాని వినియోగం నానాటికీ పెరుగుతున్నట్టు తాజా సర్వే వివరాలు వెల్లడించాయి. ముఖ్యంగా గుట్కా, తంబాకు రూపంలో గ్రామీణులు అధికంగా పొగాకును వినియోగిస్తున్నట్టు 'గృహాల్లో వినిమయం, వ్యయా'లపై సర్వే (హెచ్‌సీఈఎస్) పేర్కొన్నది. గ్రామీణ కుటుంబాలు తమ సంపాదనలో పొగాకు కోసం నాలుగు శాతం వినియోగిస్తుండగా.. విద్య కోసం మాత్రం కేవలం 2.5 శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నట్టు ఆ సర్వే తెలిపింది.ఫిబ్రవరి ఒకటిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రతిపాదించనున్న వార్షిక బడ్జెట్‌లో పొగాకు ధరలు మరింత పెంచే అవకాశం ఉండగా..

-మిగతా 2 లో



## వ్యవసాయం ఓ విజ్ఞానం

- జై కిసాన్‌కు తోడు..జై విజ్ఞాన్..జై అనుసంధాన్
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు
- సూర్యాపేటలో పలు కర్యాక్రమాలకు హాజరు

**సూర్యాపేట, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
'వ్యవసాయం ఒక విజ్ఞానమని' ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, మట్టపల్లి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించి లబ్దిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు .

-మిగతా 2 లో

# ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

### రెండేళ్లయినా లీకుల వ్యావహారమేనా



- సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది బాగోతం బయటపెట్టినందుకే నోటీసులు
- కోల్ స్కామ్‌తో కాంగ్రెస్ పతనం ఖాయం
- కోల్ స్కాంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- మి అవినీతిని బయటపెట్టే వరకు ఊరుకునేది లేదు
- మిడియా సమావేశంలో హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: సీఎం రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సెటైర్లు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు శుక్రవారం మిడియాతో మాట్లాడారు. నాడు కోల్ స్కాం యూపీఏ ప్రభుత్వ పతనానికి కారణమైందని ప్రస్తావించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కోల్ స్కాం నాందిగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది బాగోతం

-మిగతా 2 లో



## రాజ్యాంగం ప్రకారమే కేటీఆర్‌పై విచారణ

- అలీబాబా 420 దొంగల మాదిరిగా కేసీఆర్ కుటుంబం దోపిడీ
- తోడబుట్టిన చెల్లె కవిత తన ఫోన్ ట్యాపింగ్ చేశారని గగ్గోలు
- బీజేపీ నేతల ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలి
- బీఆర్ఎస్ హయాంలో కేవలం 3 నెలల్లో 547 ఫోన్లు ట్యాప్
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్‌జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సిట్ విచారణ పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. విచారణ రాజ్యాంగం ప్రకారమే జరుగుతున్నదని స్పష్టం చేశారు.

-మిగతా 2 లో

# ఇరాన్‌పై అమెరికా యుద్ధ సన్నాహాలు

మొదటి తరువాయి

ఇరాన్‌ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. పెద్దసంఖ్యలో అమెరికా యుద్ధ నౌకలు ఇరాన్ దిశగా కదులుతున్నాయని ప్రెసిడెంట్ ట్రంప్ వెల్లడించగా, తమ వేలు ట్రిగ్గర్‌పైనే ఉందని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్ జీసీ) హెచ్చరించింది. ఇరాన్‌పై సైనిక చర్యను చేపట్టే ఆప్షన్ కూడా తమ ఎదుట ఉందని ట్రంప్ మొదటి నుంచే చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఇప్పుడు మరోసారి ఇరుదేశాలు పరస్పర హెచ్చరికలు చేసుకున్నాయి. దీంతో మళ్లీ అమెరికా ఇరాన్, ఇరాన్ ఇజ్రాయిల్ సైనిక ఘర్షణ జరుగుతుందనే ప్రచారానికి బలం చేకూరుతోంది.

ఇరాన్ వైపుగా పెద్దసంఖ్యలో మా యుద్ధనౌకలు : ట్రంప్

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సదస్సుకు హాజరైన అమెరికా అధ్యక్షుడు అక్కడి నుంచి అమెరికాకు బయలుదేరే ముందు మీడియాకు కీలక వివరాలను వెల్లడించారు. అమెరికా సైన్యం పెద్దసంఖ్యలో యుద్ధ నౌకలపై గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ వైపుగా కదులుతోందని అన్నారు. ఏమీ జరగకుండా ఆపడమే తనకు ఇష్టమని, తాము ఇరాన్‌ను చాలా నిశితంగా పరిశీలిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారులను చంపడాన్ని ఇక ఆపాలని ఆయన ఇరాన్‌ను మరోసారి హెచ్చరించారు. అణ్వస్త్ర కార్యక్రమాన్ని మళ్లీ మొదలుపెట్టాలనే ఆలోచనను కూడా పక్కనపెట్టాలని ఇరాన్‌కు ట్రంప్ హితవు పలికారు. ఇరాన్‌ను కట్టడి చేయడానికే ఈ మోహరింపు తప్ప, సైనిక చర్య కోసం కాదని స్పష్టం చేశారు. ఒకవేళ యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని ఇరాన్ మళ్లీ మొదలుపెడితే, అమెరికా తప్పక స్పందిస్తుందని ఆయన తేల్చి చెప్పారు. ఇరాన్‌లోని ఏ ప్రదేశంలో యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించినా, అక్కడికి వెళ్లి దాడి చేస్తామన్నారు. తన హెచ్చరికల తర్వాత దాదాపు 840 మంది నిరసన కారులను ఉరి తీయడాన్ని ఇరాన్ ఆపిందన్నారు. ఒకవేళ ఆ నిరసనకారులను ఇరాన్ ఉరితీస్తే, మును పెన్నడూ జరగనంత తీవ్రదాడిని ఇరాన్‌పై చేస్తామని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని చిన్నాభిన్నం చేసేలా తమ దాడి ఉంటుందన్నారు.

అమెరికా సైనిక స్థావరాల రక్షణ కోసమే

ట్రంప్ తాజా ప్రకటనను అమెరికా అధికార వర్గాలు సైతం ధ్రువీకరించాయి. యుద్ధ విమానాలతో కూడిన యూఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌక, పలు గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్లు త్వరలోనే పశ్చిమాసియా ప్రాంతంలోకి చేరుకుంటాయని వెల్లడించాయి. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, సైనిక దళాల రక్షణ కోసం గల్ఫ్ సముద్ర జలాల్లో ఈ అదనపు గగనతల రక్షణ వ్యవస్థలను అమెరికా మోహరిస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ సైనిక ఘర్షణ మొదలైతే, ఇరాన్ క్షిపణి దాడుల నుంచి తమ సైనిక స్థావరాలకు రక్షణ కల్పించేందుకే ఈ ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

అమెరికా దాడి చేస్తే, మా ప్రతిదాడి ధర్మబద్ధమైందే

"ఈసారి మా దేశంపై అమెరికా దాడి చేస్తే ఊరుకోం. పశ్చిమాసియా ప్రాంతంలో ఉన్న అన్ని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేస్తాం. అమెరికా ప్రభావం కలిగిన అన్ని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటాం. అమెరికా విషయంలో మా ప్రతిదాడిని ధర్మబద్ధమైందిగా, సక్రమమైందిగా పరిగణించాల్సి ఉంటుంది. అమెరికా ఆచితూచి స్పందిస్తే మంచిది" అని ఇరాన్‌కు చెందిన హై ర్యాంకింగ్ మిలిటరీ అధికారి జనరల్ అలీ అబ్దుల్లాహీ ఆలియాబాదీ హెచ్చరించారు.

నిరసనకారుల్లో 2,427 మంది అమరులు : ఇరాన్

ప్రభుత్వ వ్యతిరేక నిరసనలపై ఇరాన్ సర్కారు తాజాగా అధికారిక వివరాలను విడుదల చేసింది. దీని ప్రకారం నిరసనల్లో దాదాపు 3,117 మంది చనిపోయారు. వారిలో 2,427 మంది అమరులు అని ఇరాన్ ప్రభుత్వానికి చెందిన ఫౌండేషన్ ఫర్ మార్టైర్స్ అండ్ వెటరన్స్ వెల్లడించింది. అమరుల కేటగిరీలో ఇరాన్ భద్రతా బలగాల సభ్యులు, అమాయక ప్రజలు ఉన్నారని తెలిపింది.

ఈసారి దాడి చేస్తే తీవ్ర పర్యవసానాలు : ఇరాన్

అమెరికాకు ఇరాన్ కీలక హెచ్చరిక చేసింది. గల్ఫ్ సముద్ర జలాల్లో అమెరికా సైనిక మోహరింపులను నిశితంగా పరిశీలిస్తున్నామని వెల్లడించింది. తమ వేలు ట్రిగ్గర్‌పైనే ఉందని ఇరాన్ ఐఆర్‌జీసీ కమాండర్ మహ్మద్ పక్పౌర్ వార్నింగ్ ఇచ్చారు. తప్పుడు అంచనాలతో ఇరాన్‌పై దాడులు చేస్తే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా, ఇజ్రాయిల్‌లు తెలుసుకోవాలన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ నుంచి ఆదేశాలు అందిన మరుక్షణమే తాము శత్రువులపై విరుచుకుపడతామని తేల్చి చెప్పారు.

# స్టూడెంట్‌గా సీఎం రేవంత్

మొదటి తరువాయి

**దావోస్ నుంచి నేరుగా అమెరికాకు..**

ఇటీవల స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి, అక్కడ తెలంగాణకు భారీగా పెట్టుబడులను ఆకర్షించడంలో సఫలీకృతమయ్యారు. ఆ పర్యటన ముగించుకుని ఆయన నేరుగా అమెరికా చేరుకున్నారు. ఆదివారం నుంచి హార్వర్డ్ క్యాంపస్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక తరగతులకు ఆయన హాజరు కానున్నారు.

**లీడర్‌షిప్ ఫర్ ది 21st సెంచరీ' కోర్సు ప్రత్యేకతలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ కోర్సు పేరు 'Leadership for the 21st Century: Chaos, Conflict, and Courage. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా నాయకత్వ పటిమను ఎలా పెంచుకోవాలి అనే అంశంపై ఈ కోర్సు దృష్టి సారిస్తుంది.

**ఈ కోర్సులో ప్రధానంగా చర్చించే అంశాలు:**

కేస్ స్టడీస్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంక్లిష్టమైన సామాజిక, రాజకీయ సమస్యలను కేస్ స్టడీస్‌గా తీసుకుని విశ్లేషించడం.

నిర్ణయాధికారం: క్లిష్ట సమయాల్లో సాహసోపేతమైన మరియు సమర్థవంతమైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలి?

ప్రజా సంబంధాలు: ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపే దిశగా ఆలోచనా విధానాన్ని మెరుగుపరుచుకోవడం.

వ్యూహరచన: 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన వ్యూహాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడం.

**పాలనలో నూతన అధ్యాయం**

ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి కూడా, నేర్చుకోవాలనే తపనతో విద్యార్థిగా మారడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని, అంతర్జాతీయ స్థాయిలో నేర్చుకున్న పాలనా మెళకువలను తెలంగాణ అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు రేవంత్ రెడ్డి ఉపయోగించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

“నిరంతరం నేర్చుకునే వాడే నిజమైన నాయకుడు. హార్వర్డ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పొందే ఈ అనుభవం తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలకు దిశానిర్దేశం చేస్తుంది.“ అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**షెడ్యూల్ వివరాలు**

శిక్షణ కాలం: జనవరి 26 నుండి జనవరి 30 వరకు.

ప్రధాన కార్యక్రమం: తరగతులు ముగిసిన అనంతరం హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుండి సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా సర్టిఫికెట్ అందుకోనున్నారు.

తిరుగు ప్రయాణం: అమెరికా పర్యటన మరియు శిక్షణ ముగించుకుని ఫిబ్రవరి 2వ తేదీన ముఖ్యమంత్రి తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

ముఖ్యమంత్రి గైర్హాజరీలో రాష్ట్ర పాలనా వ్యవహారాలపై ఆయన ఇప్పటికే మంత్రులకు, ఉన్నతాధికారులకు తగు సూచనలు చేశారు. సాంకేతికత ద్వారా ఆయన ఎప్పటికప్పుడు రాష్ట్ర పరిస్థితులను పర్యవేక్షించనున్నారు.

# ఏడు గంటలు కేటీఆర్ విచారణ

మొదటి తరువాయి

ర్యాలీగా చేరుకున్నారు. బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి పలువురు నాయకులు భారీ సంఖ్యలో కార్యకర్తలతో కేటీఆర్ ఊరేగింపుగా రావడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి 200 అడుగుల దూరంలోనే కార్యకర్తలు, ఇతర నాయకులను పోలీసులు ఆపేశారు. కేవలం కేటీఆర్ కారును మాత్రమే ఏసీపీ కార్యాలయంలోకి అనుమతించారు. దాంతో పెద్ద ఎత్తున పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ రోడ్డు మీదనే బైటాయించారు. ఏసీపీ కార్యాలయంలోకి ప్రవేశించిన కేటీఆర్‌ను అప్పటికే వేచి ఉన్న సిట్ అధికారులు ఆయనను ప్రత్యేక గదిలో కూర్చోబెట్టి కొద్ది సేపటి తర్వాత ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ విచారణలో డీసీపీలు రితురాజ్, నారాయణ్‌రావు, ఏసీపీలు వెంకటగిరి, శ్రీధర్ తదితరులు పాల్గొనగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ముఖ్యంగా రూ.12 కోట్లు విలువ చేసే ఎలక్టోరల్ బాండ్స్‌ను సంధ్య శ్రీధర్ నుంచి అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి మీరు వసూలు చేసింది నిజమేనా? అంటూ ప్రశ్నల వర్షాన్ని సిట్ అధికారులు ప్రారంభించినట్టు తెలిసింది. ఈ విధంగా ఎన్ని కోట్ల రూపాయలను ఎలక్టోరల్ బాండ్స్ పేరిట సేకరించారు, అందుకు మీరు ఎస్ఐబీకి చెందిన కొందరు అధికారుల సహకారాన్ని తీసుకున్న మాట నిజమేనా అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం. అలాగే సిరిసిల్లలో ఫోన్‌ట్యాపింగ్ వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి కొన్ని ఫార్మాస్యూటికల్ కంపెనీలు, మరికొందరు వ్యాపారవేత్తలు, సినీ సెలెబ్రిటీల ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడింది నిజమేనా అని కూడా సిట్ ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఏయే సినీనటులు నేను బెదిరించినట్టు మీకు ఫిర్యాదు చేశారని కేటీఆర్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. అందుకు మా ప్రశ్నలు అవునా, కాదా అని సమాధానమివ్వండని సిట్ అధికారులు కేటీఆర్‌ను అడిగినట్టు తెలిసింది. అదే సమయంలో, రాధాకిషన్‌రావుకు మీరు కొన్ని ఫోన్ నెంబర్లను పంపించి ట్యాపింగ్ చేయాలని చెప్పారట కదా అనే ప్రశ్నకు.. అలా చెప్పినట్టు ఆయన చెప్పారా అంటూ కేటీఆర్ ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. కాగా పోలీసు అధికారులతో నాకు సంబంధమేమిటని కేటీఆర్ ప్రశ్నించగా.. మరి రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావులకు పలుమార్లు మీరు ఫోన్ చేసినట్టుగా ఉంది కదా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. అదే సమయంలో ఒక అధికారి కేటీఆర్ ముందు కొందరి పేర్ల జాబితాను ఉంచి వీరంతా మీకు తెలుసా అని ప్రశ్నించగా.. రాజకీయ నాయకుడిగా చాలా మంది కలుస్తారు, మాట్లాడుతారు అందరినీ గుర్తు పెట్టుకోలేం కదా అని ఆయన సమాధానమిచ్చినట్టు సమాచారం. మధ్యాహ్నం 2-3 గంటల వరకు భోజన విరామం ఇచ్చాక.. సాయంత్రం 6.15 గంటల వరకు కేటీఆర్‌కు పలు ప్రశ్నలను సిట్ అధికారులు సంధించినట్టు తెలిసింది. కొన్నింటికి సమాధానమిచ్చిన కేటీఆర్ మరికొన్ని ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు వేస్తూ పోయారని సమాచారం. మొత్తమ్మీద ఏడు గంటలకు పైగా కేటీఆర్‌ను విచారించిన సిట్ అధికారులు.. ఆ సమాచారాన్ని పూర్తిగా రికార్డు చేసినట్టు తెలిసింది. చివరగా విచారణ కొనసాగుతున్నదనీ, అవసరమైతే మరోసారి పిలుస్తామని సిట్ అధికారులు కేటీఆర్‌కు తెలిపి పంపించివేశారని సమాచారం. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చిన కేటీఆర్‌ను చూసి, బయట వేచి ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున 'కేటీఆర్ జిందాబాద్', 'పోలీస్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. వారి నినాదాల మధ్య కారెక్కిన కేటీఆర్.. తన కాన్వాయ్ తో వెళ్లారు.

# రాజ్యాంగం ప్రకారమే కేటీఆర్‌పై విచారణ

మొదటి తరువాయి

బీఆర్‌ఎస్ నేతల మాటలనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారనీ, బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ వచ్చాకే బొగ్గు టెండర్లలో పారదర్శకత వచ్చిందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలనీ, రాజకీయ కక్ష సాధిస్తే అధికారంలోకి రాగానే చర్యలుండేవన్నారు. అలీబాబా 420 దొంగల మాదిరిగా కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ దీపం ఆగిపోకుండా "ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం" అంటూ కేటీఆర్ రాగాలు డ. తీస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. తోడబుట్టిన చెల్లె కవిత తన ఫోన్ ట్యాపింగ్ చేశారని గగ్గోలు పెడుతుంటే కేటీఆర్ సమాధానం చెప్పలేకపోతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా ఫోన్ ట్యాపింగ్ చేయడం తీవ్రమైందని అన్నారు. కాళేశ్వరం అవినీతి పట్ల కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన కేంద్ర మంత్రి బండి సంజరును ప్రశ్నించారు. బీజేపీ నేతల ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలని తెలిపారు. అదే విధంగా సినీతారల ఫోన్లు ఎందుకు ట్యాపింగ్ చేయాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ఇప్పటికైనా కల్వకుంట్ల కవిత నిజాలు మాట్లాడుతున్నారని ఆయన స్వాగతించారు. కవితను చెల్లెలుగా ఎప్పుడూ గౌరవిస్తానన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కేవలం 3 నెలల్లో 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని చెప్పారు. తన స్నేహితుని ఫోన్ కూడా ట్యాప్ అయిందని తెలిపారు. ఏఐసీసీ ఇంచార్జీలో మార్పు ఉండదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# జనగననకు కేంద్రం రంగం సిద్ధం

మొదటి తరువాయి

వినియోగం వంటి వివరాలు కూడా సేకరించాలని ఆదేశించింది. కుటుంబంలో ఎవరెవరు ఏయే పని చేస్తున్నారో స్పష్టమైన వివరాలు సేకరించాల్సిదే కేంద్రం తేల్చి చెప్పింది. ఏ విధమైన మరుగుదొడ్డి ఉందో రికార్డుల్లో స్పష్టంగా చెప్పాలని గణన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్నానాల కోసం ఏ తరహా బాత్‌రూం ఉందో వివరాల్లో పొందుపరచాలని తెలపాలని వెల్లడించింది. వంట కోసం వాడుతున్న గ్యాస్ కనెక్షన్ వివరాలను కూడా అధికారులు సేకరించనున్నారు. ఇంటి యజమాని ఎస్సీ, ఎస్టీ, ఇతర ఏ వర్గానికి చెందిన వారో అనే వివరాలు తప్పక నమోదు చేయాల్సి ఉంటుంది.

# మట్టి సాక్షిగా చెప్తున్నానేను ఏ తప్పూ చేయలేదు

మొదటి తరువాయి

నయవంచన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టేది లేదన్నారు. కాంగ్రెస్‌ను బొంద పెట్టేదాకా నిద్రపోబోమని అన్నారు. గత 20 ఏండ్లుగా రాష్ట్రం కోసం, ప్రజల కోసం పని చేస్తున్నానని చెప్పారు. డ్రగ్స్ తీసుకుంటాననీ, సినీ హీరోయిన్లతో సంబంధాలున్నాయంటూ తనపై వ్యక్తిత్వ హననం జరిగిందని అన్నారు. దీనికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. తన కుటుంబాన్ని, పిల్లలను కూడా మానసిక క్షోభకు గురి చేశారని చెప్పారు. వ్యక్తిత్వ హననం చేసిన వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అవినీతి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపైన వంద శాతం ప్రాణం పోయేదాకా పోరాడుతూనే ఉంటామన్నారు. తనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు చెప్పారు. లీకుల మీద ఆధారపడి ఈ ప్రభుత్వం నడుస్తున్నదని అన్నారు. మీడియా వాస్తవాలను గ్రహించి రాయలనీ, ప్రసారం చేయాలని సూచించారు. అమృత్ పథకంలో, సింగరేణి బొగ్గు కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డి కీలక సూత్రధారి అనీ, ఆయనపై సిట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. విచారణ సమయంలో తారక రామారావు తప్ప ఏ రావు లేరని అన్నారు. ఈ విచారణలో తనతోపాటు మంత్రుల ఫోన్లు కూడా ట్యాప్ అవుతున్నాయన్న నిజం తేలిపోయిందని వివరించారు. తాము భయపడే వాళ్లమైతే సమయం అడిగే వాళ్లమనీ, కోర్టును ఆశ్రయించే వాళ్లమని గుర్తు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో చీల్చి చెండాడతామని అన్నారు.

# విద్య కన్నా గుట్కాపైనే ఎక్కువ ఖర్చు

మొదటి తరువాయి

తాజా సర్వే ఆసక్తిని కలిగిస్తున్నది. గత దశాబ్ద కాలంలో దేశంలో పొగాకు వినియోగం స్థిరంగా పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2011-12 నుంచి 2023-24 మధ్య పొగాకుపై తలసరి వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం పెరిగింది.

# ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

మొదటి తరువాయి

బయటపెట్టినందుకే నోటీసులు పంపించారని చెప్పుకొచ్చారు. కోల్ స్కాంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉడత బెదిరింపులకు భయపడేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. ధైర్యం ఉంటే సిట్ విచారణ వీడియో బయటపెట్టాలని సవాల్ విసిరారు. లీకులతో ప్రభుత్వాన్ని ఎంతకాలం నడుపుతారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సిట్.. పొట్టు.. లట్టుకి భయపడేది లేదని ఎద్దేవా చేశారు. మీ అవినీతిని బయటపెట్టే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణిలో సోలార్ పవర్ స్కాం బయటపడిందని ఆరోపించారు. నాడు సింగరేణి సిరుల గనిగా ఉండేదని తెలిపారు. నేడు సింగరేణి సృజన్ గనిగా మారిందని విమర్శలు చేశారు. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. మంత్రుల పంచాయతీ కాంగ్రెస్‌కు ఉరితాడులా మారిందని ఆక్షేపించారు. సృజన్ వ్యవహారం బయటపెట్టిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేదని విమర్శించారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే సిట్ నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహించారు. సిట్ విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. లోపల ఏదో జరుగుతోందని తప్పుడు లీకులు ఇస్తున్నారని ఆరోపించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కట్టుకథలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతారని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి బంధువు భూ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా అయ్యిందని ఎద్దేవా చేశారు.

# వ్యవసాయం ఓ విజ్ఞానం

మొదటి తరువాయి

అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కళాశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. 'వ్యవసాయం ఒక విజ్ఞానమని', ఇంతకు పూర్వం దేశంలో జై జవాన్, జై కిసాన్, నినాదం ఉండేదని, ఆ తర్వాత జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం వచ్చిందని,ప్రస్తుతం ఇది జై జవాన్ ,జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ గా మారిందని తెలిపారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రైతులకు రెండు కోట్ల 47 లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రోసీడింగ్స్ ను అందజేశారు. అంతేకాక స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో 89 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యాన్ని పండిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా 85శాతం మందికి ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. మట్టపల్లి అభివృద్ధికి తన వంతు శాయ శక్తుల ఇదివరకే కృషి చేశానని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. హుజూర్నగర్ నుండి మట్టపల్లి వరకు 80 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు మంజూరు చేశామని, గతంలో 50 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మించామని చెప్పారు. కృష్ణ ,గోదావరి జిల్లాలో ఒక చుక్క నీటిని కూడా వదులుకోమని, కృష్ణ,గోదావరి జలాల హక్కులు కాపాడుకునేందుకు ఏ పోరాటైనకైనా సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. హుజూర్నగర్, కోదాడ ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే తన లక్ష్యమన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు హెడ్‌లైట్ నియమం పునరుద్ధరించాలి

-రాష్ట్ర ప్రభుత్వానికి పర్యావరణ పరిరక్షణ సమితి వినతి
-ఎల్ఈడీ లైట్లతో రాత్రి ప్రయాణం ప్రమాదకరం: నరేష్ దండు




**హైదరాబాద్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పట్టణాలు, జాతీయ రహదారుల్లో రాత్రివేళ వాహనాలు నడిపే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న భయాందోళనలు, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై పర్యావరణ పరిరక్షణ సమితి ఆందోళన వ్యక్తం చేసింది. వాహనాల హెడ్‌లైట్ల వల్ల కలిగే ప్రమాదాలను తగ్గించేందుకు గతంలో అమలులో ఉన్న హెడ్‌లైట్లపై బ్లాక్ స్టిక్కర్ లేదా పెయింట్ వేసే నిబంధనను తిరిగి కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వినతి చేసింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ నరేష్ దండు మాట్లాడుతూ, ప్రస్తుతం అధిక కాంతి తీవ్రత కలిగిన ఎల్ఈడీ హెడ్‌లైట్లు వాహనదారుల దృష్టిని పూర్తిగా భంగం పరుస్తున్నాయని పేర్కొన్నారు. ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ల కారణంగా కళ్లు మసకబారడం, రోడ్డు సిగ్నల్స్ సరిగా కనిపించకపోవడం వంటి పరిస్థితులు తలెత్తుతూ ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు.

గతంలో వాహనాల హెడ్‌లైట్లపై సగం వరకు బ్లాక్ స్టిక్కర్ లేదా పెయింట్ వేయాలనే నిబంధన అమలులో ఉండేదని, దాని వల్ల కాంతి తీవ్రత నియంత్రణలో ఉండి ప్రమాదాలు గణనీయంగా తగ్గిన ఉదాహరణలు ఉన్నాయని నరేష్ దండు గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆ నిబంధనను పూర్తిగా విస్మరించడం, ట్రాఫిక్ నియంత్రణలు సడలిపోవడం వల్ల రోడ్లపై ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "పట్టణాల్లో రాత్రివేళ వాహనాలు నడపడం ప్రజలకు భయంగా మారింది. అధిక కాంతి వెలువడే ఎల్ఈడీ లైట్ల కారణంగా చిన్న తప్పిదమే పెద్ద ప్రమాదానికి దారితీస్తోంది. ప్రజల ప్రాణాలను కాపాడాలంటే హెడ్‌లైట్లపై బ్లాక్ స్టిక్కర్ లేదా పెయింట్ వేసే నిబంధనను వెంటనే పునరుద్ధరించి, కఠినంగా అమలు చేయాలి" అని నరేష్ దండు ప్రభుత్వాన్ని కోరారు. రోడ్డు భద్రత, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. హెడ్‌లైట్ నియంత్రణల పునరుద్ధరణతో రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాకుండా, ప్రజలకు భద్రమైన ప్రయాణ వాతావరణం ఏర్పడుతుందని సమితి అభిప్రాయపడింది.

# శివ స్వాములకు అన్నప్రసాద వితరణ



**షాద్‌నగర్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : షాద్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో వెలసిన శ్రీ రుద్రాక్ష శివాలయంలో శివరాత్రి పండుగ పురస్కరించుకొని ప్రతిరోజూ శివమాలలు ధరించిన శివ స్వాములకు అన్నప్రసాదం నిర్వహణ జరుగుతోంది. ఈ పవిత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం పదహారవ రోజు అన్నప్రసాదాన్ని వెంకటేశ్వర కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ మురళీమోహన్ (అప్పి) దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివ స్వాములకు సత్కారభరితంగా అన్నప్రసాదం అందజేసిన అనంతరం, వారు మురళీమోహన్ దంపతులను మరియు వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా జరుగుతున్న ఈ సేవా కార్యక్రమం పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింతగా అలంకరించింది.

# చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్ట్



**పెద్దపల్లి, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పెద్దపల్లి జిల్లా రామగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి మాట్లాడుతూ, పాలకుర్తి మండలం జెడి నగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. మహిళల మెడలో ఉన్న సుమారు 42 గ్రాముల బంగారు చైన్లను దొంగిలించినట్లు పేర్కొన్నారు. కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో బైకులపై తిరుగుతూ వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు పుస్తెల తాళ్లు తెంపుకునేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. దొంగిలించిన బంగారాన్ని మహారాష్ట్రలో అమ్మేందుకు కాళేశ్వరం వైపు వెళుతుండగా, సెంటినరి కాలనీ వద్ద రామగిరి పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి రెండు బంగారు పుస్తెల తాళ్లు, బజాజ్ డిస్కవరీ బైక్, పల్సర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిసిపి రామ్ రెడ్డి వెల్లడించారు. ఈ నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను డిసిపి రామ్ రెడ్డి అభినందించి అవార్డులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఏసీబీ మడత రమేష్, మంథని సీఐ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర నిర్ణయాలపై మహిళా కాంగ్రెస్ ఆగ్రహం



**కీసర, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మెడ్చెల్ జిల్లా కీసర మండలంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ తీరుపై చర్చా కార్యక్రమం ఘనంగా జరిగింది. పేదల హక్కులపై కేంద్రం దాడి చేస్తున్నదని ఆరోపిస్తూ, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చిన నిర్ణయాన్ని మహిళా నాయకులు తీవ్రంగా నిరసించారు. ఈ అవగాహన సదస్సుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి చింతల నిర్మల రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో పాటు మెడ్చెల్‌మల్కాజగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి రాజనోల లక్ష్మీ, స్టేట్ సెక్రటరీ అనంత లక్ష్మీ, బి. బ్లాక్ ప్రెసిడెంట్ శ్వేత రాజ్, గ్రామ మహిళా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజనోల లక్ష్మీ మాట్లాడుతూ, అధికార కేంద్రీకరణ పద్ధతి సంక్షేమాన్ని నిరాకరిస్తోందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చింతల నిర్మల రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి సంక్షేమ పథకంలో మొదటి అవకాశం మహిళలకే లభిస్తుందని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళల కోసం మహాలక్ష్మి ఉచిత ఆర్టీసీ ప్రయాణం, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తున్నామని వివరించారు. కీసర గ్రామ మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం మహిళా నాయకుల ఉత్సాహభరిత పాల్గొనికతో, గ్రామ మహిళల సమగ్ర హాజరుతో విశేషంగా సాగింది.

# బైరాపూర్ దర్గాలో ఉర్సు జాతర గంధోత్సవం లో పాల్గొన్న సుంకిరెడ్డి




**వెల్దండ, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వెల్దండ మండలంలోని బైరాపూర్ గ్రామంలో శుక్రవారం సైదులు దర్గా ఉర్సు జాతర గంధోత్సవం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తరువాత దర్గా కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలో దర్గా ఆవరణలో నిర్మించిన రేకుల షెడ్డు భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రతా అవగాహన సదస్సు



**కరీంనగర్ ,జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** 37వ జాతీయ రోడ్డు భద్రతా సంవత్సరం సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ కరీంనగర్, ఐసో టీం ఇండియా & సేఫర్ ఇండియన్ రోడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఐవీవై హై స్కూల్, సీతారాంపూర్‌లో విద్యార్థుల కోసం రోడ్డు భద్రతా విద్యా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ ఏసీపీ బండారి యాదగిరి స్వామి రోడ్డు సైన్ బ్యానర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. విజేత విద్యార్థిని లెంకల సిరి ప్రియకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీని బహుమతిగా అందజేశారు. వసంత పంచమి సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ట్రాఫిక్ పోలీస్ ఎస్‌హెచ్ఓ మహ్మద్ కరీం ఉల్లా ఖాన్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలు మోటార్ బైక్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని, సైకిల్ తొక్కేటప్పుడు కూడా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. మోటారు వాహనాల పెరుగుదలతో ప్రమాదాలు అధికమవుతున్నందున విస్తృత అవగాహన అవసరమని అన్నారు. సి.వి. ఆనంద్, ఐపీఎస్ ప్రారంభించిన ఆపరేషన్-రోజ్ రోడ్డు భద్రతా విద్యా కార్యక్రమం ప్రాణాంతక ప్రమాదాలను తగ్గించడంలో, సురక్షిత రోడ్ల నిర్మాణంలో ఫలవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీవై హై స్కూల్ డైరెక్టర్ మహేష్, సీఈఓ ఘన్శామ్ ఓఝా, జనరల్ సెక్రటరీ అన్మోల్ ఓఝా, పీఆర్ఓ అబ్దుల్ అస్లాం, ఉపాధ్యాయులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉర్స్ షరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



**వంగూరు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వంగూరు మండల పరిధిలోని సర్వారెడ్డిపల్లి సమీపంలో ఉన్న నేల్లీగుట్ట ఉర్స్ షరీఫ్ దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, వంగూరు ఎమ్మార్వో మురలీమోహన్ హాజరై ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా వంగూరు సర్పంచ్ యాదయ్య, సర్వారెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణ సంపత్ రావు, దర్గా కమిటీ సభ్యులు మన్సూర్ ఖాన్, ఖాయమ్ ఖాన్, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగయ్య, యూసఫ్ ఖాన్, పాండురంగయ్య, రఫీతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు విశేషంగా హాజరై ప్రార్థనల్లో భాగమయ్యారు.దర్గాలో జరిగిన ఈ ప్రత్యేక ప్రార్థనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింతగా అలంకరించాయి. ప్రజలతో కలిసి నాయకులు పాల్గొనడం విశేషంగా నిలిచింది.


# ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు ప్రారంభం



**మనోహరాబాద్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
**మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రం**లోని స్థానిక ఎల్లమ్మ చెరువులో సుందరీకరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చెరువు కట్టపై ఉన్న తుమ్మ చెట్లను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో తొలగించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎల్లమ్మ చెరువు సుందరీకరణలో భాగంగానే పనులు ప్రారంభించామని తెలిపారు. గ్రామంలోని సమస్యలు పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రూపా గౌడ్, అశోక్, చిన్న, బాలకృష్ణ పాల్గొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో చెరువు సుందరీకరణ పనులు కొనసాగనున్నాయి.

## బాధిత కుటుంబానికి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

- అందజేసిన కడ్తాల్ మాజీ జెడ్పీటిసి దశరథ్ నాయక్



**కడ్తాల్, జనవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కడ్తాల్ మండలం మక్త మధారం గ్రామానికి చెందిన నింగ్యారీ కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాదిత కుటుంబాన్ని పరామర్శించారు.ఇట్టి విషయాన్ని గ్రామ సర్పంచ్ నరసింహ గౌడ్ ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ కడ్తాల్ మాజీ జెడ్పీటిసి దశరథ్ నాయక్ దృష్టికి తీసుకువెళ్ళగా అట్టి కుటుంబానికి తక్షణ సహాయంగా రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కడ్తాల్ మాజీ జడ్పీటిసి దశరథ్ నాయక్ తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుడు నింగ్యరీ కృష్ణయ్య కుటుంబానికి 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ భాష, మాజీ సర్పంచులు సులోచన సాయిలు,హరిచంద్ నాయక్, లక్ష్మీ కృష్ణ నాయక్, మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి,వార్డు సభ్యులు సరిత నాగేష్, మాజీ ఉపసర్పంచ్ గణేష్,రాములు నాయక్,నాయకులు, ప్రభాకర్, జంగయ్య,కోటియా,రాములు, నరేష్,మర్ల చెన్నయ్య,రమేష్, రాజేందర్ ,నరేష్, సాయిలు, మల్లేష్,స్వామి,చందు, బాలకృష్ణ, నరేందర్, క్రీడాకారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు





**గోదావరిఖని, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం గోదావరిఖనిలో జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ జాతరను మినీ మేడారంగా భావిస్తూ, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ జాతరకు 8 నుంచి 10 లక్షల వరకు భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తున్నామని, సింగరేణి సంస్థ 78 కోట్ల రూపాయలు, మున్సిపల్ కార్పొరేషన్ మరో 2 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ అవసరమైన సదుపాయాలను కల్పించిందని తెలిపారు. పార్కింగ్, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, గజ ఈతగాళ్ల సదుపాయం, మహిళలకు ప్రత్యేక మార్పిడి గదులు, గోదావరి నదిలో పుణ్యస్నానాల కోసం షవర్స్ వంటి ఏర్పాట్లు పూర్తిచేశామని వివరించారు.
ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున ఈ జాతరలో పాల్గొంటారని, గోదావరిఖని రెండవ మేడారంగా పేరుగాంచిందని పేర్కొన్నారు. భక్తుల భద్రత కోసం కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. గోలివాడ ప్రాంతంలో కూడా 3 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.జాతర విజయవంతం కావడానికి సింగరేణి, ఎన్టిపిసి, మున్సిపాలిటీ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఆర్జి 1 జిఎం లలిత్, దేవదాయ శాఖ కమిషనర్, జాతర కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి విమల, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో పోటీతత్వమే గెలుపునకు తొలిమెట్టు

- వాలీబాల్ టోర్నమెంట్ ను ట్రస్ వేసి ప్రారంభించిన కడ్తాల్ మాజీ జెడ్పీటిసి దశరథ్ నాయక్



**కడ్తాల్, జనవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం మక్త మాదారం గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవాల సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మక్త మందారం సర్పంచ్ నరసింహ గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి ప్రారంభించిన కడ్తాల్ మాజీ జడ్పీటిసి దశరథ్ నాయక్.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం తో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు గాను అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాణంగాలను ఏర్పాటు చేయాలన్నారు.చదువులతో పాటు క్రీడల్లో రాణించేవారికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు.యువత క్రీడల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ఉల్లాసం పెంపొందుతుందని గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులను సూచించారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ నరసింహ .లక్ష్మీ భాష. శ్రీధర్ నాయక్. మాజీ సర్పంచులు సులోచన సాయిలు. హరిచంద్ నాయక్. లక్ష్మీ కృష్ణ నాయక్.మాజీ ఎంపిటిసి మంజుల. చంద్రమౌళి. వార్డు సభ్యులు సరిత నాగేష్. యాదయ్య. మాజీ ఉపసర్పంచ్ గణేష్. రాములు నాయక్. నాయకులు బొద్దు కృష్ణయ్య. ప్రభాకర్. దుర్గం జంగయ్య. కోటియా.రాములు. నరేష్. మర్ల చెన్నయ్య. రమేష్. జలీల్.రాజేందర్.నరేష్. సాయిలు.మల్లేష్.స్వామి. చందు.బాలకృష్ణ.నరేందర్. క్రీడాకారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘ కాలిక వ్యాధులకు నేచురల్ క్యూర్ ఎంతగానో ఉపయోగపడుతుంది

## ఆయుష్ డైరెక్టర్ తెలుగు శ్రీకాంత్



**నల్లగొండ ,జనవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దీర్ఘకాల వ్యాధుల చికిత్సకు నేచురల్ క్యూర్ ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ యోగాధ్యాయన పరిషత్ ఆయుష్ శాఖ డైరెక్టర్, సెక్రటరీ డాక్టర్ పెరుగు శ్రీకాంత్ బాబు, కొనిజె రోశయ్య నేచర్ క్యూర్ హాస్పిటల్ సూపరింటెండెంట్, క్యాంపు కోఆర్డినేటర్ డాక్టర్ ఏ నవీన్ జ్యోతి అన్నారు. గురువారం పెన్షనర్ భవన్ లో మండల శాఖ ఆధ్వర్యంలో, ఆయుష్ ప్రకృతి వైద్య శిబిరం, న్యాచురోపతి, యోగ వైద్యముల ఉచిత వైద్య శిబిరం ఆమె ప్రారంభించి ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులలో సాధారణంగా వచ్చే కీళ్ల నొప్పులు జీర్ణ సమస్యలు ఇతర ఆరోగ్య సమస్యలకు ప్రకృతి వైద్యం ఎంతగానో ఉపయోగపడుతుందని, వయోవృద్ధులు యోగాసనాలు ప్రాణాయామాల పట్ల అవగాహన పెంచుకొని ఆహార నియమాలు పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అన్నారు. ఈ వయోమిత్ర కార్యక్రమము పెద్దల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం వారికి మానసిక,శారీరక ఉల్లాసాన్ని అందించడంపై దృష్టి పెడుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్లు సుహాసిని శ్రీవాణి డాక్టర్లు వెంకటేశ్వర రెడ్డి,రుచిత, జూనియర్ డాక్టర్లు, డిపిఎం లు కేతన్, కళ్యాణ్, పెన్షనర్స్ సంఘం మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జెల్లా శ్రీశైలం, జల్లా పుల్లయ్య, తాడూరు రమేష్, సిహెచ్ యాదగిరి, నేలపట్ల బాలరాజు, బిక్షం, ఆజాం అలీ, శంకరయ్య, చక్రపాణి, ఎస్ ఆంజనేయులు, రవీందర్, ప్రసాద్, ముత్యాలు, కృష్ణయ్య, ఉమామహేశ్వర్, వెంకటయ్య, వేణుగోపాల్, ఆయుష్, యునాని, ఆయుర్వేదం సిబ్బంది, యోగా ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

# ఆలయ అనువంశిక ధర్మకర్తల హక్కులకు హైకోర్టు రక్షణ

-అక్రమ ఆలయ కమిటీ ఉత్తర్వులపై ఇన్‌ట్రిమ్ స్టే

-దేవాదాయశాఖ చట్టవిరుద్ధ చర్యలపై తీవ్ర వ్యాఖ్యలు



**తుక్కుగుడ, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీనగరం గ్రామంలో స్వయంభువుగా వెలసిన పురాతన ఆలయానికి సంబంధించిన అనువంశిక వ్యవస్థాపక ధర్మకర్తల హక్కులను కాపాడుతూ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయశాఖ అధికారులు చట్ట నిబంధనలను, అలాగే 2023లో హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను విస్మరించి ఇటీవల ఏర్పాటు చేసిన నూతన ఆలయ కమిటీ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ, జనవరి 21, 2026న హైకోర్టు ఇన్?ట్రిమ్ ఆర్డర్ జారీ చేసింది.

ఈ ఆలయానికి సంబంధించి 1990 సంవత్సరం వరకు సుమారు వంద సంవత్సరాలకు పైగా శేషం కుటుంబానికి చెందిన తండ్రులు, తాతలు, మూత్తాతలు అనువంశిక ధర్మకర్తలుగా సేవలందించారని, గత 35 సంవత్సరాలుగా ప్రస్తుత తరాలు కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నాయని కోర్టుకు తెలియజేశారు. ఆరు తరాలుగా శ్రీ స్వామివారికి దూప, దీప, నైవేద్యాలు, పర్వదినాలు, ఉత్సవాలను తమ స్వంత ఖర్చులతో నిర్వహిస్తూ వస్తున్న తమ హక్కులను దేవాదాయశాఖ అధికారులు అక్రమంగా అణగతొక్కారని వారు వాదించారు. పిటిషనర్ తరపున న్యాయవాది వి. రమేష్ వాదనలు వినిపిస్తూ, దేవాదాయశాఖ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ కమిటీ ఏర్పాటు చేశారని, గతంలో ఇదే అంశంపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా పట్టించుకోలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ఈ వాదనలను తీవ్రంగా పరిగణించిన హైకోర్టు, దేవాదాయశాఖ చట్టవిరుద్ధ చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తాజా కమిటీ ఉత్తర్వులను నిలిపివేసింది. ఇదే తరహాలో 2023లో కూడా దేవాదాయశాఖ అధికారులు చట్టవిరుద్ధంగా కమిటీ ఏర్పాటు చేయగా, ఆ సందర్భంలో కోర్టు ధిక్కరణ కేసును ఎదుర్కొన్న విషయం ప్రస్తావనకు వచ్చింది. మూడు సంవత్సరాలుగా న్యాయం కోసం పోరాడుతున్న తమకు భగవత్ కృపతో న్యాయం జరిగిందని అనువంశిక వ్యవస్థాపక ధర్మకర్తలు శేషం జగన్నాథాచార్యులు, శేషం శ్రీనివాసాచార్యులు తెలిపారు. తమతో పాటు ఇతర ధర్మకర్తలు అందరూ హర్షం వ్యక్తం చేస్తూ, న్యాయానికి న్యాయం జరిగిందని, న్యాయవ్యవస్థపై తమ విశ్వాసం మరింత బలపడిందన్నారు.

## నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన బి శరత్ చంద్ర




**నల్లగొండ ,జనవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ నూతన చైర్మన్ గా బి శరత్ చంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మార్గదర్శకాల్లో పట్టణ అభివృద్ధి కార్యక్రమాల అమలులో,తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానని,ప్రతి వార్డులో పారిశుధ్య మెరుగుదల స్వచ్ఛతపై కఠిన పర్యవేక్షణ ఉంటుందని పెండింగ్ అభివృద్ధి పనులకు వేగవంతం చేసి అధికారులుసిబ్బంది సమన్వయంతో పనిచేస్తానని స్వచ్ఛ నల్గొండ గా తీర్చిదిద్దుతానని తెలిపారు.

## రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



**మహబూబాబాద్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, మోదుగులగూడెం విద్యార్థులకు రవాణా శాఖ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరణ, వాహనాలను ఓవర్టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు విద్యార్థులకు వివరించారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, దీర్ఘ ప్రయాణాల్లో విశ్రాంతి తీసుకోవాలని, శీతాకాలంవర్షాకాలంలో రోడ్డు ప్రయాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. జనవరి 1 నుండి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి





**ఎలిగేడు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో శుక్రవారం సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనిర్వచనీయమైందన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హిందూ ఫోర్స్ స్థాపించి బ్రిటిష్ గుండెల్లో రైలు పరిగెత్తేలా చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్, ర్యాకల్ దేవ్ పల్లె సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్, లాలపల్లె సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి, సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు, సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ ఉపాధ్యక్షులు అడ్డగుంట రవి గౌడ్ ,కోశాధికారి కుమార్ యాదవ్ అడ్డగుంట తిరుపతి, బోయిని సుమన్, ప్రశాంత్, శ్రీను ,రమేష్, హరీష్ ,సతీష్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు

## క్రీడలతో మానసిక ఉల్లాసం - తహసిల్దార్ యాకన్న



**ఎలిగేడు, జనవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వం ఏర్పడుతుందని ఎలిగేడు తహసిల్దార్ యాకన్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 26 జనవరి నీ పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడ పోటీలను తహసిల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని సోదర భావం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చదువులో చురుకుగా రాణించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం వసంత పంచమి వేడుకల్లో భాగంగా పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవికి విద్యార్థులతో కలిసి తహసిల్దార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్ రావు, సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయలక్ష్మి, గ్రామ కార్యదర్శి అంజలి ,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీలో మొక్కల పెంపకం ప్రారంభం.





**ఎలిగేడు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మండల కేంద్రంలోని నర్సరీలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2026- 27 సంవత్సర వర్షాకాల సీజన్ లో సరిపడ మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నర్సరీలో మొక్కలను సంరక్షించేందుకు నీటి సౌకర్యంతో పాటు పగడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిరణ్, ఏపీఓ సదానందం, గ్రామపంచాయతీ కార్యదర్శి అంజలి తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఐద్వా జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**అచ్చంపేట, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో హైదరాబాదులో ఈ నెల 25 నుంచి జరగనున్న జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మల మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మహిళా ప్రతినిధులు పాల్గొనే ఈ మహాసభలు మూడు రోజులపాటు ఘనంగా జరుగుతాయని తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు, హక్కులను రక్షించేందుకు ఐద్వా పోరాటాలు కొనసాగిస్తుందని, భవిష్యత్తులో మహిళా సమస్యల పరిష్కారానికి మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. సమాజంలోని అన్ని అవకాశాల్లో మహిళలకు సగభాగం ఇవ్వాల్సిందేనని, పురుషాధిక్య సమాజం అసమానతలను పెంచుతోందని విమర్శించారు. ఐక్య పోరాటాల ద్వారానే మహిళా హక్కులు రక్షించబడతాయని నిర్మల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు కొండమోని బుచ్చమ్మ, ఈరమ్మ, నీలం కృష్ణమ్మ, దాసరి లక్ష్మమ్మ, కొండమోని అనిత, పెద్దమ్మ, కొండమోని తిరుపతమ్మ, కొండమోని పద్మమ్మ, జర్పుల లక్ష్మీబాయి, పొలుమూరి రాములమ్మ, సాటు శారద, గుడ్లనర్వ పార్వతమ్మ, పానుగంటి వెంకటమ్మ, వర్ధం లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో వసంత పంచమి వేడుకలు





చిన్నారులకు అక్షరాభ్యాసం , అన్నప్రాసన, మరియు బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్.

**ఎలిగేడు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు మండల కేంద్రంలోని అంగన్వాడీ 3వ సెంటర్‌లో శుక్రవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, శ్రీమంతం కార్యక్రమాలు జరిపారు. వేడుకల్లో పాల్గొన్న ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు అందించే పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. అనంతరం బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్‌ను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సూర్యకళ, గ్రామపంచాయతీ కార్యదర్శి అంజలి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దేవేందర్, అంగన్వాడీ టీచర్లు సరోజన, జ్యోతి, సరస్వతి, ఆశ, సరోజతో పాటు చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

# కడ్తాల్ పోలీస్ స్టేషన్ సందర్శించిన కమిషనర్

**కడ్తాల్, జనవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులతో మరియు సిబ్బందితో మాట్లాడారు. మరియు రికార్డు లను పరశీలించారు. ఈ సందర్శన సందర్భంగా కమిషనర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజా ఫిర్యాదులను అత్యంత మర్యాదతో స్వీకరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా వినాలని, అలాగే చట్టప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా ప్రతి ఫిర్యాదును తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా, సమయపాలనతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడడం, వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించడం పోలీస్ శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారని కడ్తాల్ సిఐ గంగాధర్ తెలిపారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులతో మరియు సిబ్బందితో మాట్లాడారు మరియు రికార్డు లను పరశీలించారు. ఈ సందర్శన సందర్భంగా కమిషనర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజా ఫిర్యాదులను అత్యంత మర్యాదతో స్వీకరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా వినాలని, అలాగే చట్టప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా ప్రతి ఫిర్యాదును తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా, సమయపాలనతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడడం, వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించడం పోలీస్ శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని కమిషనర్ గారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనీ kadthal ఇన్స్పెక్టర్ శ్రీ గంగాధర్ గారు తెలిపారు

# ఘనంగా వసంత పంచమి వేడుకలు





**మహబూబాబాద్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మర్వాడి సత్రంలో శుక్రవారం వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించబడ్డాయి. శ్రీ సరస్వతి శిశు మందిరం ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. ముందుగా సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య తల్లిదండ్రులు తమ పిల్లలకు భక్తిశ్రద్ధలతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వేదపండితుడు పరిపూర్ణ చారి మాట్లాడుతూ, వసంత పంచమి రోజున అక్షరాభ్యాసం చేసిన చిన్నారులు అపార విద్యా జ్ఞానంతో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశీర్వదించారు. వేడుకల అనంతరం అన్నధాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మర్వాడి యువ మోర్చా ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శ్రీరంగం మురళీ, వివేక్, హిందూ భారతి పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం



**వెల్దండ, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో శుక్రవారం 16వ జాతీయ ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ ఓటు అనే ఆయుధాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని సూచించారు. జడ్పీహెచ్ఎస్ నుంచి వెల్దండ బస్ స్టేజివరకు ఓటర్లు, విద్యార్థులు, అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మనవహారంగా ఏర్పడి తహసిల్దార్ కార్తీక్ కుమార్ ఆధ్వర్యంలో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ విష్ణువర్ధన్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి, ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్, వార్డు సభ్యులు, నాగర్‌కర్నూల్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, హెచ్ఎం రవీందర్, ఆర్ఐ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం






**నాగర్‌కర్నూల్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. “నా భారత్ నా ఓటు” నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలిసి ఓటర్ల ప్రతిజ్ఞ చేయించగా, కొత్తగా నమోదు అయిన ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటు హక్కు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ రవి నాయక్, డిఇఓ రమేష్ కుమార్, ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలిగేడులో జాతీయ ఓటర్ దినోత్సవం



**ఎలిగేడు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ యాకన్న మాట్లాడుతూ, ఈ నెల 25న సెలవు దినం కావడంతో ముందస్తుగా ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఓటు యొక్క విశిష్టతను వివరించి, అధికారులు, విద్యార్థులు కలిసి ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు దేవేందర్ రావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ జయలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి అంజలి, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసుపై బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు విమర్శలు



**వెల్దండ, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వెల్దండ మండల బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై రాజకీయ కక్ష సాధింపుకు పాల్పడుతోందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో బిఆర్ఎస్ నేతలపై విచారణలు జరపడం ప్రజా సమస్యల నుండి దృష్టి మళ్లించడమేనని అన్నారు. సింగరేణి బొగ్గు గనుల అవినీతిని బయటపెట్టడంతో, బొగ్గు కుంభకోణాన్ని పక్కదారి పట్టించడానికే సిట్ వ్యవహారం ముందుకు తెచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను నిలిపివేసి, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పోలే అశోక్, ఎకుల శ్రీను, బర్కం గణేష్, గోరేటి దశరథం, అన్వర్ పాషా, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టం పేరు మార్పు సరికాదు: ఎమ్మెల్యే వంశీకృష్ణ



**ఉప్పునుంతల, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తాడూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమైన అచ్చంపేట ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, వికసిత్ భారత్‌రోజ్‌గార్ మరియు అజీవికా మిషన్ బిల్లు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచడం గ్రామీణ పేదల చెమటను అవమానించడం అవుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిధులు తగ్గించడం, బకాయిలు పెంచడం, పనిదినాల్లో కోతలు విధించడం ద్వారా గ్రామీణ ఉపాధి హక్కును కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, రాజీవ్ పంచాయతీరాజ్ సంఘటన్ కన్వీనర్ చత్రు నాయక్, మండల నాయకులు, సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ ఎలికంటి శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్చార్జ్ చింతల రాజగోపాల్, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు, కూలీలు పాల్గొన్నారు.




**ఎలిగేడు ప్రభుత్వ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు.**

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



**పాలకుర్తి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం బసంతనగర్ ప్రభుత్వ పాఠశాలలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్వో జారిపోతుల సునీత హాజరై, ప్రజాస్వామ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటర్‌గా పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి, ప్రతి ఎన్నికల్లో అధిక సంఖ్యలో ఓటర్లు పోలయ్యేలా అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఓటర్లందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బసంతనగర్ సర్పంచ్ పర్షవేణి శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, రెవెన్యూ అధికారులు సంతోష్, రమ్యశ్రీ, మల్క రెడ్డి, సంపత్, ఇస్త్యాక్, శ్రీనివాస్, రాజేందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ హితం కోసం సంఘాలు పనిచేయాలి



**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాంబవ జాగృతి ఎంప్లాయిస్ మరియు రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శాతవాహన యూనివర్సిటీ చౌరస్తా వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ సంఘాలు సమాజ హితం కోసం పనిచేయాలని, సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగించి దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధ్యక్షుడు మానువాడ శంకర్ మాట్లాడుతూ విడిపోతే పడిపోతాం, నిలిస్తే గెలుస్తాం. ఐకమత్యమే అభివృద్ధికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి శ్యామ్, కోశాధికారి చంటి సుకుమార్, లీగల్ అడ్వైజర్ కే. ఆనంద్ భాస్కర్, గౌరవాధ్యక్షుడు వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు కొత్తూరి శంకర్, రామడుగు రవీందర్, మహిళా ఉపాధ్యక్షులు జీవనజ్యోతి, కార్యదర్శి పొత్తూరి దేవదాసు, సభ్యులు పెంట అంజన్న, శంకర్, నరసయ్య, సునీత, అమరావతి, మురళీకృష్ణతో పాటు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



**కరీంనగర్ జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ నేత, 50వ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొత్త అనిల్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనిల్‌తో పాటు ఎస్. గోపి, కొత్త అరవింద్, సాయిళ్ళ శ్రీనివాసు తదితరులు కూడా కాంగ్రెస్‌లో చేరగా, వారికి రాజేందర్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో చేరిన వారికి తగిన న్యాయం చేస్తామని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు కొత్త అనిల్ తెలిపారు. రాజేందర్ రావు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి తోడ్పడతామని ఆయన స్పష్టం చేశారు.

## వసంత పంచమి పర్వదినాన శిశు మందిర్‌లో అక్షరాభ్యాసం



**హుస్నాబాద్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వసంత పంచమి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. సరస్వతీ మాత పూజతో ప్రారంభమైన ఈ వేడుకలో 40 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించగా, సరస్వతీ హోమం కూడా జరిపారు. చిన్నారుల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తితో పాల్గొని పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, ప్రబంధకారిణి అధ్యక్షుడు గౌరిశెట్టి ప్రకాష్, కార్యదర్శి బబ్బుల రవీందర్, సహకార దర్శి పోల్సాని బాపూరావు, కోశాధికారి బొమ్మగాని సతీష్, సభ్యురాలు మాడిశెట్టి హేమలత, ప్రధానాచార్య పాలయమాం శ్రీలతతో పాటు మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. వివరాల ప్రకారం, బొమ్మకల్ గ్రామానికి చెందిన ర్యాకం వెంకటేష్, సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎలవేని వేణు అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి ఇసుకను ట్రాక్టర్లలో కరీంనగర్ వైపు తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై ఎలాంటి రాయితీలు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## పి.ఎస్.హెచ్.ఎం.ఏ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. జిల్లా విద్యాధికారిణి శారద మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల బలోపేతం కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, పి.ఎస్.హెచ్.ఎం.ఏ జిల్లా అధ్యక్షుడు అత్తె రాజారాం, ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రమేష్, జిల్లా అధ్యక్షుడు కుక్క వెంకటస్వామి, మహిళా ఉపాధ్యక్షురాలు మంజులత, మహిళా కార్యదర్శి రాజమణి, జిల్లా ఆర్థిక కార్యదర్శి పులి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోట శ్రవణ్ రెడ్డి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి నూతి మల్లన్న, రాష్ట్ర లీగల్ కమిటీ సభ్యుడు కర్రె మధుసూధనరెడ్డి, జిల్లా కార్యదర్శి సముద్రాల ప్రవీణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు దుంపేటి రాజేశం, వెంకటేశం, ఉపాధ్యాయ మిత్రులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ అధికారంతోనే నేతకాని సామాజికవర్గ అభివృద్ధి సాధ్యం




**పెద్దపల్లి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేతకాని సమాజం రాజకీయంగా ఎదిగి నిర్ణయాత్మక శక్తిగా మారినప్పుడే ఆ వర్గం ఉనికి చాటుకోగలదని నేతకాని కుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గొల్లే రాజ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలను నేతకాని కులస్థులు ఒక అవకాశంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఏ పార్టీ నుంచైనా బి-ఫామ్ పొంది పోటీకి సిద్ధమయ్యే అభ్యర్థులకు జిల్లా కమిటీతో పాటు కుల సంఘం పెద్దలు వెన్నుదన్నుగా నిలుస్తారని భరోసా ఇచ్చారు. రాజకీయ అధికారం ప్రజలకు సేవ చేయడానికి గొడుగులా ఉపయోగపడుతుందని అంబేద్కర్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని, కుల బాంధవులు ఐక్యమత్యంతో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టాలని ఆయన కోరారు. ఐక్యమత్యమే మహాబలమని, అందరం కలిసికట్టుగా పోరాడితేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నేతకాని కుల సంఘం నాయకులు బౌతు గంగాజలం, మాదాసు సుదాకర్, గొల్లే మల్లయ్య, గొల్లే సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలన

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పాలకుర్తి ,జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో జరగనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం పరిశీలించారు. అనంతరం వనదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. జాతర ప్రాంగణంలో 20 లక్షల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కలెక్టర్, భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, విద్యుత్, స్నానఘట్టాలు, టాయిలెట్స్ వంటి ఏర్పాట్లను పరిశీలించారు. జాతర సమయం దగ్గరపడుతున్నందున పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని, భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, పంచాయతీ రాజ్ ఏఈ రుషికేష్, సెక్రటరీ కోడిజుట్టు సుభాష్, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి, జాతర ఆలయ కమిటీ చైర్మన్ గాలిపల్లి నర్సయ్య, వైస్ చైర్మన్ తుంగ నర్సయ్య, గాలిపల్లి దుర్గయ్య, ఆవుల చంద్రయ్య, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం



**పాలకుర్తి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం గుడిపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పంచసూక్త పూర్ణహుతి ముహూర్తంలో వేదపండితుల నడుమ శ్రీ భూనీలాదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం, సరస్వతి పూజ, అక్షరాభ్యాసం, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గుడిపల్లి, పుట్నూరు, జయ్యారం గ్రామాల పాలకవర్గాలు కలిసి నిర్వహించిన బ్రహ్మోత్సవాలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. శనివారం రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కాసర్ల శ్రీసుధ, కాసర్ల కిరణ్, తోట ప్రశాంత్, వార్డు సభ్యులు, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి, మాజీ సర్పంచ్ గంగాధర రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకై కృషి చేస్తాం - బండారి శేఖర్




**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. మంచిర్యాల చౌరస్తా నుండి సుభాష్ విగ్రహం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు కలిసి ర్యాలీ నిర్వహించి నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ నేతాజీ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని, ఆయన స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లో సింహం గుర్తుతో పోటీ చేస్తామని తెలిపారు. అవకాశవాద పార్టీలను ఓడించి, సింహం గుర్తును ప్రతి ఇంటికి చేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలక సంస్థలు, 10 మున్సిపాలిటీల్లో సింహం గుర్తుతో విజయం సాధించి జెండా ఎగరావేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సత్యారావు, జిల్లా కమిటీ సభ్యులు కురువెల్లి శంకర్, బొంకురి సురేందర్, ప్రశాంత్ కుమార్, స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్, యూత్ లీగ్ నాయకుడు సాయి, మరో 50 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలక్క జాతర పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని 19వ డివిజన్‌లో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అదే రోజు కమాన్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గోవింద భవన్ హోటల్ను ఆయన ప్రారంభించారు. అనంతరం చింతకుంటలో సమ్మక్క సారక్క అమ్మవారి జాతర ఉత్సవాలకు సంబంధించి ఎరుకల కోయ పూజారుల ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను తన నివాసంలో ఆవిష్కరించారు. కరీంనగర్ 21వ డివిజన్‌లో శ్రీ విజయదుర్గ కాలనీవాసులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కమలాకర్, అక్కడ కూడా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, అభ్యర్థి చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ వాసులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## యువ ప్రతిభను ప్రోత్సహించడంలో టీజీఐసీజీ కీలకపాత్ర

### - కలెక్టర్ ప్రమీల సత్పతి



**కరీంనగర్ ,జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :కరీంనగర్ ఐటీ టవర్‌లో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమం జరిగింది. కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుండి 60కి పైగా యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతి మాట్లాడుతూ యువత ప్రతిభను ప్రోత్సహించడంలో టీజీఐసీ కీలకపాత్ర పోషిస్తోందని, ఆవిష్కరణలు పోటీ మార్కెట్‌కు తట్టుకునేలా ఉండాలని సూచించారు. ఆవిష్కరణలో ఎదురయ్యే కష్టాలను విజయానికి మార్గాలుగా భావించి ముందుకు సాగాలని, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై మాత్రమే ఆధారపడకుండా మార్కెట్లో స్వతంత్రంగా నిలబడే స్థిరత్వం కలిగి ఉండాలని అన్నారు. తెలంగాణ యువతలో సృజనాత్మకత కొదువలేదని, సరైన మార్కెట్ తోడైతే అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ సీఈఓ మేరాజ్ ఫహీమ్, కమ్యూనికేషన్ మేనేజర్ బుద్ధవరపు వాణి పాల్గొన్నారు.

# పరిపాలన అంశాలపై అధికారులు దృష్టి సారించాలి

### - కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా పరిపాలన అంశాలపై అధికారులు మరింత శ్రద్ధ చూపాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రతి శాఖలో జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఖాళీల వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అలాగే వివిధ శాఖల వద్ద ఉన్న ఇంట్రెస్ట్ ఫండ్స్ వివరాలను అందించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్ ప్రతిపాదనలు వారం రోజుల్లో క్లియర్ చేయాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్‌లకు అవసరమైన ఎన్‌ఓసీలు సంబంధిత శాఖలు జారీ చేయాలని సూచించారు. కోర్టు కేసుల వివరాలను జనవరి 28 నాటికి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులను నిర్దిష్ట సమయంలో క్లియర్ చేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగం లేని పాత సామాన్లు, కంప్యూటర్లు, టేబుల్స్ తొలగించాలని ఆదేశించారు. సిబ్బంది విధులకు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గణతంత్ర దినోత్సవ సందేశాన్ని క్లుప్తంగా తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు భవనాల్లో ఉన్న కార్యాలయాలను షిఫ్ట్ చేయాలని, కలెక్టరేట్ వెబ్‌సైట్‌లో ప్రతి శాఖకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి బండి సంజయ్ సమక్షంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కరీంనగర్ జిల్లా శాఖ రూపొందించిన 2026 సంవత్సర టేబుల్, వాల్ క్యాలెండర్లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జ్యోతి నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ పునర్వైభవం, పునర్నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా అనేక అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా నైపుణ్యం కలిగిన యువతను తీర్చిదిద్దేందుకు కేంద్రం విస్తృతంగా నిధులు కేటాయిస్తోందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. దేశభక్తి, జాతీయ భావం, సంస్కృతి పట్ల గౌరవం కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ప్రధాన భూమిక వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించిన ఆయన, గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పి.ఆర్.సి. అరియర్స్, సంపాదిత సెలవులు, జి.పి.ఎఫ్., జి.ఐ.ఎస్. చెల్లింపులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, కుల గణన సర్వే గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డి.ఏలను విడుదల చేసి, పి.ఆర్.సి. అమలు చేయాలని, విద్యాశాఖకు మంత్రిని నియమించి కీలక నిర్ణయాలు ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతి రావు, ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్యతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. ఉదయ్ కిరణ్ రావు, రాష్ట్ర బాధ్యులు కే. హరి చరణ్, వి. కరుణాకర్ రావు, పి. వినయధరాజు, బి. పవన్ కుమార్, వి. వెంకటరమణ, వి. జగన్మోహన్, డి. శ్రీనివాసరావు, జైపాల్ రెడ్డి, వైద్య రంగ ప్రతినిధులు డాక్టర్ గోపి సుందర్, డాక్టర్ జి. శరత్ కుమార్ రెడ్డి, ఏవోటి వెంకటేశ్వరరావు, జిల్లా మండల బాధ్యులు కె. సుధాకర్, కే. శ్రీధర్ రెడ్డి, కే. శ్రీకాంత్, ఎం. సతీష్ కుమార్, వి. రవీందర్ రెడ్డి, కే. సాయన్న, ఆర్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## నిబంధనలు పాటించని పెట్రోలు బంకుపై ఫిర్యాదు



**పెద్దపల్లి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన కిసాన్ సేవా కేంద్రం యజమాని పొదిల సదయ్య, గ్రామపంచాయతి అనుమతి లేకుండా జియో సంస్థ పెట్రోలు బంకు నిర్మాణ పనులు కొనసాగిస్తున్నాయని ఆరోపిస్తూ కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. సదయ్య మాట్లాడుతూ, గ్రామపంచాయతి ఇప్పటికే పనులు ఆపివేయాలని నోటీసు ఇచ్చినా నిర్మాణం యథావిధిగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి పెట్రోలు బంకు మధ్య కనీసం 300 మీటర్ల దూరం ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా, జనవరి 30లోగా నివేదిక సమర్పించాలని రామగుండం పోలీసు కమిషనరుకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. జియో సంస్థ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పెట్రోలు బంకు నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## ఓటు హక్కుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సర్దార్ రవీందర్ సింగ్



**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఓటర్ల జాబితా విషయంలో తీవ్ర విమర్శలు చేశారు. నగరంలో జీవిస్తున్న ప్రజల ఓట్లు తొలగించబడగా, మృతి చెందిన వారి పేర్లు మాత్రం జాబితాలో ఉన్నాయని ఆరోపించారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటు కోసం కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బూత్ వారీగా ఓట్లను విడుదల చేయకపోవడం, ఒకే డివిజన్‌లో ఉన్న ప్రజల ఓట్లు వేరే బూత్‌లకు మార్చడం వంటి లోపాలను అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. 1963 నుంచి కరీంనగర్‌లో ఎన్నడూ ఇలాంటి ఓట్ల మార్పిడి జరగలేదని, కాంగ్రెస్ హయాంలోనే ప్రజలు ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయని వారిని మున్సిపల్ ఎన్నికల్లో తొలగించడం ఏ రాజ్యాంగంలో ఉందో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. ఓటు హక్కుకు భంగం కలిగించవద్దని, ప్రజల హక్కులను కాపాడే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.

# సీఐటీయూ కరీంనగర్ రూరల్ మండల కన్వీనర్‌గా దూడం గంగాధరి ఎన్నిక

**కరీంనగర్ రూరల్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ మండల సీఐటీయూ అనుబంధ యూనియన్స్ జనరల్ బాడీ సమావేశం ఇరుకుల్ల గ్రామంలో కామ్రేడ్ గట్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన కమిటీకి అభినందనలు తెలియజేసి, జిల్లా కమిటీ నుండి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. మండల పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల తక్షణ పరిష్కారం కోసం, గ్రామీణ నేపథ్య కార్మిక సంఘాల ఏర్పాటు కోసం మండల కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్మికుల పని ప్రదేశాల్లో సీఐటీయూ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని సభ్యులను కోరారు. అతను కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, గత 11 సంవత్సరాలుగా ప్రజల హక్కులను కాలరాయడం, ప్రభుత్వ రంగ సంస్థలను



కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం, లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లు, భీమా రంగంలో 100% విదేశీ పెట్టుబడులు వంటి చట్టాలను అమలు చేయడం ప్రజాసంక్షేమానికి విరుద్ధమని అన్నారు. వీటికి వ్యతిరేకంగా సీఐటీయూ దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తోందని, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తరువాత నూతన మండల కమిటీని ఎన్నుకోగా, కన్వీనర్‌గా దూడం గంగాధరిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కాశి పాక శంకరయ్య, వేముల గట్టయ్య, ఖర్చు శ్రీనివాస్, బలుసుల సరిత, విట్టల్, ఏగుర్ల నారాయణ, గొల్లపల్లి లక్ష్మి, కూర అంజి రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపు

**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి డిమాండ్ చేశారు. తిమ్మపూర్‌లో ఉప రవాణా కమిషనర్ పురుషోత్తంకు సమ్మె నోటీసు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్త లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం కార్మికుల హక్కులను హరించడమేనని విమర్శించారు. విద్యుత్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలని, పేదలకు ఉపాధి హామీ కల్పించే ఎంజైరేగా చట్టాన్ని కొనసాగించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12,000 ఇవ్వాలని హామీ ఇచ్చి



అమలు చేయలేదని గుర్తుచేసి, ఆ వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు నష్టం కలిగిస్తున్న రాపిడో యాప్‌ను రద్దు చేయాలని కూడా కోరారు. టాటా ఏసి, ఆటో, టాక్సీ, లారీ, రెడీమిక్స్, ప్రైవేటు బస్సులు, ట్రాలీ గూడ్స్, స్కూల్, కాలేజ్ బస్సులు, అంబులెన్స్ డ్రైవర్లు, మెకానిక్ కార్మికులు, ఆటో స్పేర్ పార్ట్ షోరూమ్‌లు, సర్వీసింగ్ సెంటర్లు, పెట్రోల్ బంక్ కార్మికులు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, గణేష్ నగర్ ఆటో అడ్డ గౌరవ బోయిన కనకయ్య, అనంతరాజు రమేష్, బాకారపు రాజు, ఇస్లావత్ గంగరాజు, దేవ్ సింగ్ రవీందర్, రాజు, వెంకరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమక్షంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**పెద్దపల్లి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలోని పలు వార్డుల్లో రూ.17.86 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అందమైన సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా మంజూరు చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల కోసం అడిగిన ప్రతి అభివృద్ధి పనికి నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. పట్టణానికి రూ.63 కోట్ల యుఐడిఎఫ్ నిధులు మంజూరు చేయడం ద్వారా మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని అన్నారు. జిల్లా కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటు ప్రజల చిరకాల వాంఛగా నిలిచిందని, అది



సాధించడం ద్వారా పెద్దపల్లికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని చెప్పారు. గత ప్రభుత్వంలో పట్టణానికి మౌలిక సదుపాయాలపై ఎలాంటి శ్రద్ధ చూపలేదని విమర్శించారు. అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇతర పార్టీలకు ఓటు వేస్తే ప్రయోజనం ఉండదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను ప్రత్యక్షంగా మున్సిపల్ సమస్యలను పర్యవేక్షిస్తూ, అభివృద్ధి పనులు మరియు సంక్షేమ పథకాల అమలులో కంటిమీద కునుకు లేకుండా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అచ్చంపేట మార్కెట్లో వేరుశనగలకు రికార్డు ధర

అమ్రాబాద్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రైతులకు శుభవార్త లభించింది. వేరుశనగలకు క్వింటాల్‌కు రూ.10,117 రికార్డు ధర లభించగా, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్ మాట్లాడుతూ ధరలు స్థిరంగా ఉంటే రైతుల కష్టాలు తీరతాయని, సరుకులు శుభ్రంగా తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు మార్కెట్లో వేరుశనగలు, మినుములు, కందులు, మక్కలు పెద్ద ఎత్తున వచ్చి మంచి ధరలు సాధించాయి. వేరుశనగలు 117 క్వింటాళ్లు, మినుములు 4 క్వింటాళ్లు, కందులు 12 క్వింటాళు ,, మక్కలు 18 క్వింటాళ్లు వచ్చి రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. అచ్చంపేట మార్కెట్లో వేరుశనగలకు ఇంతటి రికార్డు ధర రావడం రైతులకు ఉత్సాహాన్ని కలిగించింది.

# ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి

**- కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టాలని ప్రతిజ్ఞ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావడంతో పాటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్లు, పలువురు నేతలు





**కరీంనగర్ ,జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్‌లో జరిగిన బీజేపీ నేతల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు సత్యనారాయణరెడ్డి, తాటి ప్రభావతి తమ అనుచరులతో కలిసి పార్టీకి చేరారు. ఈఎన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొని కొత్తగా చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవిని బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యమని, గెలిచే అవకాశమున్న చోట పాత కార్యకర్తలకే టిక్కెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, వారిని ఆహ్వానించి కలిసికట్టుగా పనిచేసి కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి. శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, సీనియర్ నేతలు ఓదేలు, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్, డాక్టర్ పుల్లెల పవన్, బోయినిపల్లి ప్రవీణ్, గుజ్జ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ బీజేపీకి రాష్ట్రంలో మంచి వాతావరణం ఏర్పడిందని, కరీంనగర్ కార్యకర్తల సహకారంతో పార్టీ బలోపేతం అవుతోందని, మేయర్ సీటు సాధన కోసం అందరూ కలిసి పనిచేయాలని అన్నారు.

# శాతవాహన ఆర్ట్స్ కళాశాలలో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ



**కరీంనగర్ ,జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో 16వ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ భారతీయ పౌరులు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తారని, ముఖ్యంగా యువత నిష్పక్షపాతంగా ఓటు వేయాలని, అక్రమాలకు లోనుకాకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి ప్రదీప్ రాజ్, ఆచార్య వరప్రసాద్, శ్రీవాణి, మునావర్, జాఫర్, సుజాత, హుమేరా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్జీటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డైరీ అందజేత



**కరీంనగర్, డిసెంబర్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా పరిషత్ ఉపముఖ్య కార్యనిర్వాహణాధికారి బి. పవన్ కుమార్‌కు ఎస్జీటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డైరీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్జీటీయూ అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్జీటీయూ జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దేవిశెట్టి ఆంజనేయులు, జిల్లా బాధ్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్జీటీయూ ఆధ్వర్యంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ, గుండి ప్రధానోపాధ్యాయుడు భగవంతయ్యకు కూడా డైరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా బాధ్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అంజన్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కర్రె పావని రవి



**కరీంనగర్ ,జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ 63వ డివిజన్ సామాజిక కార్యకర్త, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు కర్రె పావని రవి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డిసిసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ అధ్యక్షత వహించగా, అసెంబ్లీ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.పావని మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా స్వచ్ఛంద సంస్థ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు సహాయం అందిస్తూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నామని, ఇకపై ప్రజల ఆశీస్సులతో ప్రత్యక్ష రాజకీయాల్లో సేవ చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజా సేవ చేయడానికి పావని చేరిక సంతోషకరమని, డివిజన్‌లో పార్టీ జెండా ఎగరేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజేందర్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందని, పావని విశేష కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కర్రె బీరయ్య, కర్రీ శ్రీనివాస్, ప్రభాకర్, సాయి, రజిత, కోమలత, స్వప్న, మమత, పద్మతో పాటు దాదాపు 200 మంది డివిజన్ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## మాజీ మేయర్ సునీల్ రావుపై ములకల ప్రవీణ్ తీవ్ర విమర్శలు




**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మాజీ మేయర్ సునీల్ రావు తరచూ పార్టీలు మారుతూ అధికారం వైపు మొగ్గు చూపుతున్నారని టిపిసిసి మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ములకల ప్రవీణ్ తీవ్రంగా విమర్శించారు.కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సునీల్ రావు రాజకీయ ప్రస్థానం దివంగత వెలిచాల జగపతిరావు ఆధ్వర్యంలో ప్రారంభమైందని, వారి ఆశీస్సులతో ఎదిగిన ఆయన ఇప్పుడు వారి కుమారుడు రాజేందర్ రావుపై అన్‌పార్లమెంటరీ భాషలో విమర్శలు చేయడం తగదని అన్నారు. మేయర్‌గా ఉన్న సమయంలో నగర అభివృద్ధికి చేసిన పనులు ఏమిటో ప్రజలకు చెప్పాలని, స్మార్ట్ సిటీ నిధుల దుర్వినియోగంపై మాజీ కార్పొరేటర్లు ఆరోపణలు చేస్తున్నారని గుర్తుచేశారు. రాజేందర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతోందని, ఇతర పార్టీల నేతలు కూడా చేరుతున్నారని, కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ప్రవీణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఆరు గ్యారెంటీలలో నాలుగు అమలు చేస్తోందని, మిగతావి కూడా త్వరలో అమలు చేస్తుందని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారని, ఆర్టీసీని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని అన్నారు.సునీల్ రావు ఇకపై కాంగ్రెస్ నాయకులపై అవాస్తవ వ్యాఖ్యలు చేస్తే కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ సమావేశంలో కుంభాల రాజు కుమార్, సిరికొండ శివప్రసాద్, ఇరుమల్ల మల్లేశం పాల్గొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధికై బీజేపీని గెలిపించండి

**హుస్నాబాద్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణంలోని వి ఎల్ గార్డెన్‌లో బీజేపీ మున్సిపల్ ఎన్నికల సమావేశం జరిగింది. అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్నికల ఇంచార్జ్ కూరపాటి విజయకుమార్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోందని, ప్రపంచంలో భారత్ అగ్రగామి దేశంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న మోడీకి ప్రతి పౌరుడు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్న బండి సంజయ్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలంటే బీజేపీ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఉందని




తెలిపారు. గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు నిధులు కేటాయించక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, మెరుగైన పరిపాలన కోసం బీజేపీకి ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి హుస్నాబాద్ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఒకసారి బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని అన్నారు. ఈ సమావేశంలో లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప, బొమ్మగాని సతీష్, కొత్తపల్లి అశోక్, దొడ్డి శ్రీనివాస్, గుత్తికొండ విద్యాసాగర్, రాయికుంట చందు, తగరం లక్ష్మణ్, తోట సమయ్య, పెందోట భూశంకర్ చారి, ఇల్లందుల తిరుపతి, బుడిగ వెంకటేష్, ఆషాడ శ్రీనివాస్, పోలోజు రవీందర్, భోగ మహేశ్వర్, మల్లం ప్రశాంత్, ఎర్రబెల్లి ప్రశాంత్, వడేపల్లి లక్ష్మయ్య, కొంకటి కిషోర్, నందకుమార్, గౌరవేణి మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని డిమాండ్

**పెద్దపల్లి, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్థపు మురళి కోరారు. పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల పర్యటనలో భాగంగా దాసరి ఉషా నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల గ్రామపంచాయతి ఎన్నికల్లో పద్మశాలీలు తమ సత్తా చాటారని, రాష్ట్రంలో 15 లక్షల జనాభా కలిగిన ఈ వర్గానికి తగిన టికెట్లు కేటాయించాలని డిమాండ్




చేశారు.గెలవలేని చోట ఓడించే ఓటు బ్యాంకు తమదేనని, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ టికెట్లతో పాటు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మేయర్ పదవుల్లో కూడా పద్మశాలీలకు అవకాశాలు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, మహిళా అధ్యక్షురాలు వనం దుష్యంతల, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్ర రావు, జనరల్ సెక్రటరీ వనం విశ్వనాథ్, బత్తుల రమేష్, కొండి సతీష్, గాజుల రమేష్, మూర్తి, బూర్ల దనంజయ, ఆడెపు సుధాకర్, మిట్టపల్లి శ్రీనివాస్, కన్నం రవీందర్, మిట్టపల్లి శ్రీహరి, బూర్ల లక్ష్మి నారాయణ, గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వసంత పంచమి వేడుకలు





**పెద్దపల్లి/కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలలు, దేవాలయాలు, విద్యాసంస్థల్లో సరస్వతి పూజలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని సరస్వతి దేవి పూజలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు, శాస్త్రీయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ శిశు మందిర్ హై స్కూల్‌లో వేద మంత్రాల సాక్షిగా వంద మందికి పైగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం బాసర అమ్మవారి కుంకుమ ప్రసాదం అందజేశారు.జూలపల్లి జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ప్రత్యేక పూజలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ పాల్గొని విద్యారంభం శుభకరమని, సరస్వతి మాత ఆశీస్సులతో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు.కరీంనగర్ మహాశక్తి దేవాలయంలో జరిగిన ఉత్సవాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు.బెజ్జంకి ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేశారు. జమ్మికుంట శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం











పాఠశాలలో వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సరస్వతి హోమం, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 80 మంది చిన్నారులు అక్షరాభ్యాసం చేయగా, నేతాజీ జయంతి వేడుకలు కూడా జరిగాయి. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ వసంత పంచమి వేడుకలు విద్యతో



పాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతను ప్రతిబింబించాయి.

## జాతీయ బాలికా దినోత్సవం
# సమానత్వానికి సంకేతం




ప్రతి సంవత్సరం జనవరి 24న జరుపుకునే జాతీయ బాలికా దినోత్సవం బాలికల సాధికారతకు, సమానత్వానికి బాటలు వేస్తోంది. 2008లో మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ఈ దినోత్సవం, బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కొనసాగుతోంది. చరిత్రపరంగా బాలికలు ఎదుర్కొన్న లింగ వివక్ష, బాల్య వివాహాలు, విద్యా లోపం, ఆరోగ్య నిర్లక్ష్యం వంటి సమస్యలను సమాజం దృష్టికి తీసుకువచ్చి, వారికి సమాన అవకాశాలు కల్పించాలనే సంకల్పాన్ని ఈ రోజు ప్రతిబింబిస్తుంది. చదువు బాలికలకు ఆత్మవిశ్వాసం, స్వతంత్రతను అందించడమే కాకుండా కుటుంబం, సమాజం, దేశానికి బలమైన పునాది అవుతుంది. బేటీ బచావో బేటీ పఢావో, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు బాలికల భవిష్యత్తుకు ఆర్థిక భద్రతను కల్పిస్తున్నాయి. బాల్య వివాహ నిషేధ చట్టం, ఫోక్సు చట్టం వంటి చట్టాలు బాలికల రక్షణకు చట్టపరమైన భరోసా ఇస్తున్నాయి. నేడు క్రీడలు, శాస్త్రం, సాంకేతికత, విద్య, పాలన వంటి రంగాల్లో బాలికలు ప్రతిభను నిరూపిస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. బాలిక అంటే భారం కాదు, ఒక ఆశ, ఒక శక్తి, ఒక వెలుగైన భవిష్యత్తు అని సమాజం అంగీకరించాల్సిన సమయం ఆసన్నమైంది. జాతీయ బాలికా దినోత్సవం ఒక రోజు మాత్రమే కాకుండా, సంవత్సరం పొడవునా బాలికల పట్ల మన బాధ్యతను గుర్తు చేసే దినంగా మారాలని పేర్కొన్నారు.

**వ్యాసకర్త యాటెల్లి కవిత**
**(టీచర్, ఎంపీపీఎస్ సలాబాత్‌పూర్)**



# ఘనంగా అచ్చంపేట వి.ఎస్.పి.ఎల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



**అచ్చంపేట, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట కేంద్రంలో 13వ వార్డు క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా జరిగింది. వి.ఎస్.పి.ఎల్ క్రికెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పది జట్లు పాల్గొన్నాయి. మ్యాచ్‌ను మల్లేష్ ప్రారంభించగా, కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ శివకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు జిలకర సాంబశివరావు, ఆనందు, శ్యాము, రఘు, శ్రీశైలం, నిరంజన్, రామకృష్ణ, విజయ్, జాన్ రాజు, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్న ఈ టోర్నమెంట్ క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబించింది.

# జాతీయ రహదారిపై ఇసుక తొలగించరూ..





**ఆమనగల్లు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు పట్టణ కేంద్రం శ్రీశైలం- హైదరాబాద్ 765 జాతీయ రహదారిపై ఇసుక, మట్టి పేరుకుపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని శ్రీ లక్ష్మీ కాటన్ మిల్లు దగ్గర జాతీయ రహదారి పొడువునా ఇసుక, మట్టి పేరుకుపోయాయి. భారీ వాహనాలు వెళ్తున్నా క్రమంలో ద్విచక్ర వాహన చోదకులు పక్కకు వెళ్లగా ఇసుకపై అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళలో సమస్య తీవ్రంగా ఉంటోంది. సంబంధిత ఎన్ హెచ్ ఏఐ అధికారులు స్పందించి రహదారిపై ఇసుక, మట్టిని తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

# ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు













**కరీంనగర్/పెద్దపల్లి ,జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్ సుభాష్ నగర్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ నేతాజీ జైహింద్ నినాదంతో యువతలో చైతన్యం రగిలించారని, ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటిష్ పాలనకు సవాలు విసిరారని గుర్తుచేశారు. పెద్దపల్లి ఐటీఐ కళాశాలలో మై భారత్, సుభాష్ చంద్రబోస్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "పరాక్రమ్ దివస్" కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం హాజరై నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ నేతాజీ నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు పోరాడిన మహానాయకుడని, యువత ఆయన ఆశయాలను పునికి పుచ్చుకోవాలని సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలలో నేతాజీ కపిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోడ గడియారాలను పంపిణీ చేశారు. మంథని శిశు మందిర్ పాఠశాలలో నేతాజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ నేతాజీ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం సాధ్యమని నమ్మారని, "మీరు రక్తాన్ని ఇవ్వండి నేను స్వాతంత్రాన్ని ఇస్తాను" అన్న ఆయన మాటలు యువతలో దేశభక్తిని రగిలించాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో నేతాజీ త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా వసంత పంచమి వేడుకలు





**ఆమనగల్లు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పట్టణంలో శ్రీ సరస్వతి శిశుమంది పాఠశాల ఆవరణలో శుక్రవారం వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాపీఠం వక్త బ్రహ్మచారి హాజరైనారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి అభిషేకం చేసి, గాయత్రి హోమం నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లి తండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక కాటన్ మిల్లు జనరల్ మేనేజర్ సాయిబాబా, శ్రీ సరస్వతి శిశు మందిర్ గౌరవ అధ్యక్షులు పాపిశెట్టి రాము, చంద్రశేఖర్, దొంతు సత్యనారాయణ, విశ్వేశ్వర్, అంజయ్య, కవిత,భువనేశ్వరి, నయన చారి, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహభావం పెంపొందించేందుకే క్రీడలు




**ఆమనగల్లు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్నేహభావం పెంపొందించాడినికే క్రీడలు నిర్వహిస్తున్నామని, క్రీడలతోనే యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టోర్నమెంట్ ఆర్గనైజర్లు చలిచీమల సతీష్, కొమ్ము ప్రసాద్, నాగిళ్ల లక్ష్మణ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కొండ ప్రాంగణంలో జబ్బు మహేష్ జ్ఞాపకార్థం మిత్రమండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ స్థాయి టోర్నమెంట్ కు సింగల్ విండో సీఈఓ దేవేందర్, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు జెనిగేల గిరి యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై శుక్రవారం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యా నికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఓటమిని తొలిమెట్టుగా తీసుకుని ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఎనుమల్ల రమేష్, శివ, మహేష్, పవన్, మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు గడ్డపై బిజెపి జెండా ఎగరడం ఖాయం

-జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి



**ఆమనగల్లు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి అన్నారు. శుక్రవారం ఆయన బిజెపి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీ గడ్డమీద కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం గౌడ సంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజిగౌడ్, రవి గౌడ్ లను కండువా కప్పి బిజెపి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్,గోరటి నరసింహ, విక్రమ్ రెడ్డి, రాంపాల్ నాయక్, దుర్గయ్య, విజయ్ కృష్ణ, శ్రీకాంత్ సింగ్, చెన్నకేశవులు, మల్లయ్య,బుచ్చయ్య వెంకటయ్య, జానయ్య, వడ్డె రాజు, గోవర్ధన్ సాయి,ప్రశాంత్, విష్ణు చారి తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండ సీఐగా రఘువీర్ రెడ్డి




**వెల్దండ,జనవరి 23( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో సీఐగా పని చేసిన విష్ణువర్ధన్ రెడ్డి, మల్టీ జోన్ 2 ఐజి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు రావడంతో ఆయన స్థానంలో నల్లగొండ జిల్లాలో డిసీఆర్బీలో పనిచేస్తున్న రఘువీర్ రెడ్డి వెల్దండ సీఐగా బదిలీపై వచ్చారు. వీరి ఇరువురిని సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు కురుమూర్తి, మహేష్ గౌడ్, వీరబాబులు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. వెల్దండ సర్కిల్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్లో పరిధిలోని శాంతిభద్రతలకు పరిరక్షణ కొరకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

# యాచారం గ్రామంలో ఘోరం

విధి కుక్కల దాడిలో మేక మృతి



**యాచారం , జనవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: యాచారం గ్రామంలో పేద రైతు మస్కు యాదయ్య కి చెందిన మేకల పై విధి కుక్కల దాడితో సంఘటన స్థలం లో మరణించిన మేక.దీనితో ఆ కుటుంబం దుఃఖం తో ఉన్నారు. తమకు ఆధారంగా ఉన్న మేక పై విధి కుక్కలు దాడి చేసి చంపిన సంఘటన పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలనే అధికారులని కోరారు చేశారు.దీనిపై గ్రామ ప్రజలు స్పందించి ప్రభుత్వం,అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# బాలల హక్కులపై విస్తృత అవగాహన అవసరం

- కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, జనవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బాలల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి అన్నారు.కమిషన్ సభ్యులు మర్రిపల్లి చందన, బి. అపర్ణ, గోగుల సరిత, ప్రేమలతా అగర్వాల్, బి. వచన్ కుమార్‌తో కలిసి ఆమె కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి పిల్లల వార్డు, మాతా శిశు కౌన్సిలింగ్ సెంటర్, సఖి కేంద్రం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, అంధులబధిరుల ఆశ్రమ పాఠశాలలు, మైనారిటీ వెల్ఫేర్ స్కూల్‌లను సందర్శించారు.తరువాత కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిపాల బ్యాంకు ఏర్పాటు, దివ్యాంగుల పింఛన్లు పాఠశాలల వద్దే అందేలా చర్యలు, సిజేరియన్ శాతం తగ్గించడం, రోడ్డు భద్రతపై అవగాహన, అంగన్వాడీలలో విద్యుత్ సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను ప్రస్తావించారు.వలస కార్మికుల పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం మంచి విషయమని, మరింత మందిని గుర్తించి చేర్చాలని సూచించారు. దత్తతపై చట్టబద్ధమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, సఖి కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు.సర్పంచుల శిక్షణలో బాలల హక్కుల అంశాన్ని చేర్చాలని, అవసరమైతే కమిషన్ సభ్యులను శిక్షణకు ఆహ్వానించాలని సూచించారు.ఈ సమావేశంలో సిడబ్ల్యుసి చైర్పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి, డిసిపిఓ పర్వీన్, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, డిహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత, సఖి అడ్మిన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మానుకోటలో ఘనంగా జాతీయ పరాక్రమ దివస్ వేడుకలు



**మానుకోట, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానుకోట పట్టణంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ సుప్రీం కమాండర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ గారి 129వ జయంతి వేడుకలను 23 జనవరి 2026న నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మానుకోట పట్టణంలో 76 సంవత్సరాల చరిత్ర గల నేతాజీ విగ్రహం వద్ద ఆజాద్ హింద్ ఫౌజ్ జెండాను ప్రముఖ వ్యాపారవేత్త శ్రీరంగం మురళి గారు ఆవిష్కరించి, అందరికీ జాతీయ పరాక్రమ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు 22 జనవరి న గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హై స్కూల్ లో వివిధ పోటీ పరీక్షలు నిర్వహించగా, 23 జనవరి న జాతీయ పరాక్రమ దివస్ సందర్భంగా స్థానిక ఎస్.వి.ఎం. ఫంక్షన్ హాల్ లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ అడ్వకేట్ సౌమిత్రి లక్ష్మణాచార్య గారు విచ్చేసి, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన వీరులను మరువకూడదని, ప్రతి విద్యార్థి ఒక ఝాన్సీ లక్ష్మీబాయి లా, ఒక భగత్ సింగ్ లా దేశ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. భారత మాత సేవలో ప్రతి ఒక్కరూ పునీతులు కావాలని సందేశమిచ్చారు. నేతాజీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కందుల నాగరాజు మాట్లాడుతూ "మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అనే నేతాజీ నినాదాన్ని గుర్తుచేస్తూ, వారి స్ఫూర్తితో దేశం కోసం సమయాన్ని ఇవ్వాలని, యువత దేశ సైనికులుగా మారాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థితో నేతాజీ సేవా సమితి యొక్క ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి ఉపాధ్యక్షులు కాశెట్టి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కుదురుపాక వివేక్, ఉప కార్యదర్శి కురియావుల గంగాధర్ గౌడ్, కోశాధికారి వొబ్బిలిశెట్టి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనగిరి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కన్వీనర్ సామ శ్రీనివాస్, ఆకారపు విశ్వనాథం, విశ్రాంత సైనికులు తండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుక



**ఆమనగల్లు, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహానికి శుక్రవారం రోజు సహృదయ ఫౌండేషన్ సభ్యులు వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సహృదయ ఫౌండేషన్ సభ్యులు ఈ పాఠశాలలో 1991బి1992 బ్యాచ్ 10 వ తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలిసి ఫౌండేషన్ తరపున సామాజిక కార్యక్రమాలు విరివిగా చేస్తూ ఉన్నారు. వీరంతా కలిసి పదవ తరగతి చదువుకున్న పాఠశాలకు సహృదయ ఫౌండేషన్ పేరు పై 2018 సంవత్సరంలో రేకుల షెడ్డుతో ఒక సభా వేదికను, అలాగే సరస్వతీ మాత విగ్రహాన్ని సుమారుగా రూ.2 లక్షల వరకు వెచ్చించి స్కూల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్ సభ్యులు ప్రతి వసంత పంచమికి సరస్వతీ మాత విగ్రహానికి పూజలు జరిపి విద్యార్థులకు స్వీట్లు ,పండ్లు, బిస్కెట్లు, పంచి పెడతారు. సహృదయ ఫౌండేషన్ అధ్యక్షుడు సంద వేణుగోపాల్ మాట్లాడుతూ... విద్యార్థులు మంచి అలవాట్లు, మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు. ఎక్కడ ఉన్నా ఉన్న ఊరును మనం చదివిన, స్కూలు మరవద్దు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంద రవి, ప్రసాద్, చింతోజు రవి కిరణ్, ఏలే శివకుమార్, అవ్వారి పాండు, బావండ్ల శంకర్, గుర్రం కేశవులు,ఫుట్వేర్, గోజే ఆనంద్, భావండ్ల నరసింహ, బావండ్ల రమేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ క్యాలెండర్ ఆవిష్కరణ

దేవరకొండ డి.ఎస్.పి శ్రీనివాసరావు.
దళితరత్న డా.బుర్రి వెంకన్న,
రాష్ట్ర ఉపాధ్యక్షులు- ఏ.ఐ.ఎస్.ఎస్.డి- తెలంగాణ రాష్ట్రం.




**దేవరకొండ జనవరి 23. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థాపించిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ 2026 క్యాలెండర్ ను దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు,దళిత రత్న డా. బుర్రి వెంకన్న చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థాపించిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దల్ క్యాలెండర్ ను నా చేతులమీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందని, మహనీయుల స్ఫూర్తిగా సమాజంలో యువతీ యువకులు సామాజిక సేవలో ముందుండాలి అన్నారు, అంబేద్కర్ స్థాపించిన సంఘం ద్వారా ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ సభ్యులు తలపెడుతున్న సామాజిక కార్యక్రమాలను అభినందించడం జరిగింది, అదేవిధంగా దళితరత్న డా. బుర్రి వెంకన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ 1927 లో మార్చ్ 13న భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా స్థాపించినఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ క్యాలెండర్ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని, భారత దేశంలో అత్యంత ప్రతిష్టమైన సంఘం కుల మత వర్గాలకు అతీతంగా యువకులు, మహిళలూ, ప్రజల్లో సామాజిక చైతన్యం నింపి వారి సమగ్ర అభివృద్ధికై పాటుపడాలన్న తపనతో ఈ సంఘం ఏర్పరచడం జరిగిందన్నారు. ఈ సంఘం ఏర్పడి 99 ఏళ్లుగా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దళిత రత్న డాక్టర్ బుర్రి వెంకన్న. బహుజన మేధావి డాక్టర్ ఏకుల రాజారావు దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములు. కొండమల్లేపల్లి మండల కన్వీనర్ మేదరి ప్రసాద్ తదితర దళ్. సభ్యులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

– ఆర్‌టిఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి



**హైదరాబాద్, జనవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచిన సమాచార హక్కు చట్టం2005ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని ఆర్‌టిఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టిఐ చట్టం అమలు రోజురోజుకు బలహీనపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి పౌరుడికి సమాచారం పొందే హక్కు ఉన్నప్పటికీ ఆ హక్కు ఆచరణలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంస్థలు రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత కలిగి ఉన్నప్పటికీ అనేక కార్యాలయాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు అవసరమైన ముఖ్య సమాచారం స్వయంచాలకంగా ప్రకటించాల్సిన బాధ్యతను కూడా అధికారులు విస్మరిస్తున్నారని ఆయన అన్నారు.ప్రతి కార్యాలయంలో ప్రజలకు స్పష్టంగా తెలిసే విధంగా ఆర్‌టిఐ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రతి శాఖలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లను నియమించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. దరఖాస్తు అందిన తేదీ నుంచి ముప్పై రోజుల్లోపు సమాచారం ఇవ్వకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, సమాచారం నిరాకరించినప్పుడు అప్పీల్ వ్యవస్థను బలోపేతం చేయాలని, నిర్లక్ష్యం చేసిన అధికారులపై జరిమానాలు తప్పనిసరిగా విధించాలని ఆయన స్పష్టం చేశారు.గ్రామస్థాయిలో ప్రజలకు ఆర్‌టిఐ అంటే ఏమిటి, ఎలా దరఖాస్తు చేయాలి, ఏ సమాచారం కోరవచ్చు అనే అంశాలపై కనీస అవగాహన కూడా లేకపోవడం ఆందోళనకరమని ఆయన అన్నారు. అందువల్ల రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు, అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఆర్‌టిఐ చట్టం అమలు పకడ్బందీగా జరిగితే ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత పెరిగి ప్రజలకు న్యాయం అందుతుందని, అవినీతి తగ్గుతుందని రాపోలు లింగస్వామి పేర్కొన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సమాచార హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం






## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, జనవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం పోలీస్ వారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమం లో భాగంగా తలకు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడిపి, ప్రతిజ్ఞ చేయించిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకె ళ్లాలని చెప్పారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేయాలన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ చూడడం, నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూ డదని చెప్పారు. అనంతరం నిబంధనలు పాటి స్తూ వాహనాలు నడుపుతామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం పోలీస్ ఏసీపీ కేపీవీ రాజు, యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల, ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ల సిఐ లు, నంధీశ్వర్ రెడ్డి,మహేందర్ రెడ్డి, మధు, సత్యనారాయణ, మరియు నియోజకవర్గం లోని నాయకులు మండల నాయకులు, సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేవాదాయ భూముల జోలికి వెళ్లినవారు చరిత్రలో భాగుపడ్డ దాఖలాలు లేవు : మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహింపట్నం , జనవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రెస్** యాచారం మండలం నందివనపర్తి గ్రామంలోని "శ్రీ ఓంకారేశ్వరాలయానికి చెందిన దేవాదాయ భూములను పరిశ్రమల పేరుతో స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు" చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఈ దేవాదాయ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కౌలు రైతుల కడుపు కొట్టే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉండటం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఈ విషయమై ఆయా గ్రామాలకు చెందిన రైతు నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని కలిసి తమ ఆవేదనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... "దేవాదాయ భూములను ముట్టుకుంటే చరిత్ర క్షమించదు. దేవుడి భూముల జోలికి వెళ్లినవారికి చరిత్రలో ఎప్పుడూ భాగుపడ్డ దాఖలాలు లేవు" అని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, లేనిపక్షంలో రానున్న రోజుల్లో రైతుల తరపున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.దేవాలయాల ఆస్తులను, రైతుల హక్కులను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి , యాచారం మండలం నదివనపర్తి శ్రీ ఓంకారేశ్వరాలయానికి చెందిన దేవాదాయ భూములను సాగు చేసుకొనే... రైతులు యాచారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి పశ్చ భాష , మాజీ సర్పంచ్ రాజు నాయక్ రైతులు తదితరులు ఉన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

## పాక్ ఉగ్రవాది హతం



**న్యూఢిల్లీ: జనవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాది హతమయ్యాడు. జమ్మూ–కాశ్మీర్ పోలీసులు జరిపిన కాల్పుల్లో ఉగ్రవాది హతమయ్యాడని ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీసల్ భిమ్ సేన్ టుటి తెలిపారు.ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లా, బిలావర్ ప్రాంతంలో భారత ఆర్మీ, సీఆర్పీఎఫ్ జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఇంటెలిజెన్స్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ప్రత్యేకసోదాలు చేపట్టారు. ఈ ప్రాంతాన్ని జవాన్లు చుట్టుముట్టి గాలించగా.. తీవ్రవాది గుర్తించి మన భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపాడు. వెంటనే భారత దళాలు ఉగ్రవాదిపై ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ కమాండర్ అయిన ఉస్మాన్ అనే ఉగ్రవాది మరణించాడు. అతడివద్ద నుంచి ఎం4 ఆటోమేటిక్ రైఫిల్, ఇతర ఆయుధాల్ని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా ఈ ప్రాంతంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదులు ఎవరైనా ఉన్నారా అనే కోణంలో గాలింపు చర్యలు చేపట్టారు.

# 14 వేల ఉద్యోగులను తొలగించనున్న అమెజాన్




**న్యూఢిల్లీ: జనవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** అమెజాన్ సంస్థ మరోసారి ఉద్యోగులను తొలగించనున్నది. వచ్చే వారం రెండో దఫా ఉద్యోగాల కోత మొదలుకానున్నది. సుమారు 14 వేల మంది ఉద్యోగులు త్వరలో తమ ఉద్యోగాన్ని కోల్పోనున్నారు. కంపెనీలో పనిచేస్తున్న దాదాపు 30 వేల మందిని తొలగించాలని ఆ సంస్థ నిర్ణయించిన విషయం తెలిసిందే. గత అక్టోబర్‌లో 14వేల వైట్ కాలర్ జాబ్స్‌ను తొలగించింది. అయితే ఈసారి కూడా గత ఏడాది తరహాలోనే ఉద్యోగుల సంఖ్య ఉంటుందని భావిస్తున్నారు. అయితే అమెజాన్ సంస్థ ప్రణాళికలు వెల్లడించేందుకు దాని ప్రతినిధులు ఆసక్తి చూపలేదు. అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటేల్, ప్రైమ్ వీడియో, హ్యూమన్ రీసోర్స్ లాంటి కేటగిరీల్లో కోత ఉండనున్నది


# అభివృద్ధి నిరంతర ప్రక్రియ: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహింపట్నం,జనవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని మలిశెట్టిగూడా, శేరిగూడ, ఖానాపూర్ గ్రామాల్లో సుమారు 2 కోట్ల 45 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఇది వరకు గ్రామాలలో, కాలనీలలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు గ్రామాలలో కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారీగా పతనమైన సెన్సెక్స్.. 6 లక్షల కోట్లు నష్టం..



భారతీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం భారీగా నష్టపోయింది. సెన్సెక్స్ 800 పాయింట్ల నష్టాన్ని చవిచూసింది. ఉదయం సెన్సెక్స్ స్వల్ప లాభాలతో 82,335.94 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. తర్వాత నెమ్మదిగా నష్టాల్లోకి చేరుకుంది. ఒక దశలో 800 పాయింట్ల వరకు నష్టపోయింది. చివరకు 769.67 పాయింట్లు (1 శాతం) నష్టపోయిన సెన్సెక్స్.. 81,537.70 వద్ద ముగిసింది.నిఫ్టీ కూడా 241.25 పాయింట్లు నష్టపోయి 25,048.65 వద్ద ముగిసింది. మొత్తంగా స్టాక్ మార్కెట్ ఒక్క రోజులోనే దాదాపు రూ.6 లక్షల కోట్లు నష్టపోయింది. గ్లోబల్ పాలిటిక్స్, ఫారిన్ ఇన్వెస్టర్లు తమ పెట్టబడులు వెనక్కు తీసుకోవడం, అమెరికా-యూరప్ వద్ద టారిఫ్ వార్ వంటి కారణాలవల్ల స్టాక్ మార్కెట్లు బాగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెలలోనే రూ. 36,591 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ప్రస్తుతం బీఎస్ఈ కంపెనీల మార్కెట్ విలువ రూ.452 కోట్లకు చేరుకుంది. డాలరుతో రూపాయి మారక విలువ 91.93తో అత్యంత కనిష్ట స్థాయికి చేరుకుంది. 0.02 శాతం రూపాయి నష్టపోయింది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్, ఎటెర్నల్, అదానీ పోర్ట్స్, ఇండిగో వంటి సంస్థలు భారీగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యునీలీవర్, ఏషియన్ పెయింట్స్ సంస్థల షేర్లు లాభపడ్డాయి. బంగారం ఔన్స్ ధర 4,926 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర 64.79 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## బంగారం ధరలపై గుడ్‌న్యూస్.. పడిపోయిన ధరలు.. ఎంత తగ్గాయంటే..?

బంగారం ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. మొన్నటివరకు వరుసగా గోల్డ్ రేట్లు పెరుగుతూ వస్తోండగా.. ఇప్పుడు ధమాల్ అంటూ పడిపోయాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు. సోమవారం నుంచి ధరలు భారీగా పెరుగుతూ వస్తోండగా.. శుక్రవారం స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గత రెండు రోజుల క్రితం బంగారం ధర ఒకేసారి రూ.6 వేలు పెరగ్గా.. గురువారం స్వల్పంగా తగ్గింది. శుక్రవారం మరికొంత తగ్గింది. గ్రీన్ ల్యాండ్ విషయంలో తమకు మద్దతు ఇవ్వని దేశాలపై భారీగా సుంకాలు విధిస్తామంటూ చేసిన ప్రకటన ట్రంప్ వెనక్కి తీసుకోవడంతో ధరలు తగ్గుతున్నాయి. ఈ పరిణామం తర్వాత వివిధ ప్రాంతాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.




**బంగారం ధరలు ఇలా..**

-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర రూ.1,54,300 వద్ద కొనసాగుతోంది. నిన్న రూ.1,54,310గా ఉంది. నిన్నటితో పోలిస్తే ఇవాళ రూ.10 మేర తగ్గిందని చెప్పవచ్చు. ఇక 22 క్యారెట్ల గోల్డ్ గురువారం రూ.1,41,450గా ఉండగా.. నేడు రూ.1,41,440కి తగ్గింది

-విజయవాడ, విశాఖపట్నంలో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ బంగారం ధర రూ.1,54,300గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,41,440 వద్ద స్థిరపడింది

-చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,54,900 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,54,910గా ఉంది. 22 క్యారెట్ల విషయానికొస్తే నిన్న రూ.1,42,000గా ఉండగా.. శుక్రవారానికి రూ.1,41,990కి చేరుకుంది

-బెంగళూరులో 24 క్యారెట్లు రూ.1,54,300 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,41,440 వద్ద స్థిరపడింది

-ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,450 వద్ద ప్రస్తుతం కొనసాగుతోంది. గురువారం ఇది రూ.1,54,460 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ల ధర రూ.1,41,590 వద్ద కొనసాగుతోంది

**నేటి వెండి ధరలు**

-ఢిల్లీలో కేజీ వెండి ధర రూ.3,24,900 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ రేటు రూ.3,25,000 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.100 తగ్గింది

-హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.3,39,900 వద్ద కొనసాగుతోంది. గురువారం దీని ధర రూ.3,40,000 వద్ద స్థిరపడింది


-చెన్నైలో కేజీ వెండి రేటు రూ.3,39,900 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.3,40,000 వద్ద స్థిరపడింది

బెంగళూరులో కేజీ వెండి ధర రూ.3,24,900 వద్ద కొనసాగుతోండగా.. నిన్న ఈ రేటు రూ.3,25,000గా ఉంది

## ఆ బ్యాంక్ కస్టమర్లకు బిగ్ అలర్ట్..!

### 24, 25 తేదీల్లో ఈ టైమ్‌లో నిలిచిపోనున్న అన్ని సేవలు! కారణం, పూర్తి వివరాలు ఇవే!

ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు చాలా సులభం అయిపోయాయి. బ్యాంక్‌కు వెళ్లాల్సిన అసవరం లేకుండానే అనేక సర్వీస్‌లు మన ఫోన్‌లోనే పూర్తి అయిపోతున్నాయి. డిజిటల్ విప్లవంలో భాగంగా అన్ని బ్యాంకులు కూడా తమ కస్టమర్లకు డిజిటల్ సేవలు అందిస్తున్నాయి. దాదాపు ప్రతి ఒక్క బ్యాంక్ కస్టమర్ డిజిటల్ సేవలకు అలవాటు పడిపోయారు. ఒక్క గంట సేపు ఆ సేవలు నిలిచిపోయినా కూడా కంగారు పడిపోతారు. అందుకే బ్యాంకులు తమ



సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్త తీసుకుంటాయి. ఏదైనా సిస్టమ్ అప్డేట్స్ ఉంటే ముందుగానే కస్టమర్లకు తెలియజేస్తున్నాయి తాజాగా ప్రముఖ ప్రైవేటు బ్యాంకు హెడ్‌డీఎఫ్‌సీ కూడా తన ఎసెన్షియల్ సిస్టమ్ మెయిటెనెన్స్‌లో భాగంగా తమ అన్ని రకాల సేవల్లో అంతరాయం ఏర్పడనుందని ముందుగానే తెలియజేసింది. శనివారం (24 జనవరి 2026) అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 4 గంటల మధ్య సేవలు నిలిచిపోతాయని, అలాగే ఆదివారం (25 జనవరి 2026) కూడా అర్ధరాత్రి 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఈ మెయింటెనెన్స్ కారణంగా అన్ని రకాల సర్వీస్‌లు హెడ్‌డీఎఫ్‌సీ నెట్ బ్యాంకింగ్, పే జ్యాప్, మై కార్డ్స్, వాట్సాప్ చాట్ బ్యాంకింగ్ సేవలు నిలిచిపోతాయని హెచ్‌డీఎఫ్‌సీ అధికారికంగా ఒక ప్రకటనలో తెలిపింది.

# స్పోర్ట్స్

### అర్ధశతకంతో రెచ్చిపోయిన సూర్య, ఇషాన్.

## రెండో టీ20లో టీమిండియా జయకేతనం..!

పొట్టి ప్రపంచకప్‌లోపే భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(82 నాటౌట్) ఫామ్ అందుకున్నాడు. టీ20ల్లో తానొక సంచలనమని చాటుతూ రాయ్‌పూర్‌లో న్యూజిలాండ్ బౌలర్లకు తన విధ్వంసాన్ని కళ్లకు కట్టాడు. టీమిండియాపై రికార్డు స్కోర్ కొట్టి విజయంపై ధీమాగా ఉన్న కివీస్ ఆశల్ని ఆవిరి చేస్తూ అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. ఇషాన్ కిషన్(76) మెరుపు హాఫ్ సెంచరీతో గట్టి పునాది వేయగా.. సూర్య, శివం దూబే(36 నాటౌట్) జోడీ కవీస్ బౌలర్లపై పిడుగల్లే విరుచుకుపడింది. దూబే భారీ సిక్సర్లతో బెంబేలెత్తించగా.. మిస్టర్ 360 తన క్లాస్ ఆటతో ప్రేక్షకులను ఊర్రూతలూగించాడు. ఫలితంగా వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా.. 2-0తో ఆధిక్యంలో దూసుకెళ్లింది.పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టు జోరుకు న్యూజిలాండ్‌కు రెండో ఓటమి తప్పలేదు. 206 పరుగులతో టీమిండియా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది కివీస్. 6 పరుగులకే ఓపెనర్లు సంజూ శాంసన్(6) అభిషేక్ శర్మ(0)లు పెవిలియన్ చేరినా.. ఇషాన్ కిషాన్(76) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి, స్టాండ్స్‌కు పంపిన ఈ చిచ్చరపిడుగు 21 బంతుల్లోనే




అర్ధ శతకం సాధించాడు.మరో ఎండ్‌లో సూర్యకుమార్ యాదవ్( 82 నాటౌట్) సైతం పెట్రేగిపోయాడు. 9వ ఓవర్లో 4, 4, 4, 4, 6, 2తో 24 రన్స్ పిండుకున్నాడు. ఏడాది తర్వాత మునపటి సూర్యను తలపించిన అతడు 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇషాన్ ఔటయ్యాక శివం దూబే(36 నాటౌట్) ఉప్పెనలా కివీస్ స్పిన్నర్లను హడలెత్తించాడు. సోధీ ఓవర్లో అతడు ఏకంగా 100 మీటర్ల సిక్సర్‌తో చెలరేగాడు. ఈ జోడీ విధ్వంసానికి 16.2 ఓవర్లలోనే టీమిండియా మ్యాచ్‌ను ముగించి సిరీస్‌లో 2-0తో ముందంజలో ఉంది.

**రచిన్, శాంట్నర్ మెరుపులతో**

తొలి టీ20లో కంగుతిన్న న్యూజిలాండ్‌కు రాయ్‌పూర్‌లో ఓపెనర్లు డెవాన్ కాన్వే(19), టిప్ సీఫర్ట్(24)లు శుభారంభమిచ్చారు. అర్ష్‌దీప్ సింగ్ ఓవర్లో మూడు ఫోర్లు, సిక్సర్‌తో 18 రన్స్ పిండుకున్నాడు కాన్వే. హర్షిత్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు సీఫర్ట్. వీరిద్దరి జోరుతో ఓవర్‌కు పది చొప్పున రన్స్ రాగా నాలుగో ఓవర్లోనే స్కోర్ 40 దాటింది. ఈ ద్వయాన్ని రానా విడదీశాడు. కాసేపటికే వరుణ్ ఓవర్లో భారీ షాట్ ఆడాలనుకున్న సీఫర్ట్ .. చేతికి చిక్కాడు. కానీ, రచిన్ రవీంద్ర(44) ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడి గ్లెన్ ఫిలిప్స్ (19)తో కలిసి25 బంతుల్లోనే 50 రన్స్ జోడించారు.డేంజరస్ ఫిలిప్స్‌ను కుల్దీప్ వెనక్కి పంపగా.. వన్డేల్లో దంచసిన డారిల్ మిచెల్(18)ను శివం దూబే డగౌట్ చేర్చడంతో స్కోర్ వేగం తగ్గింది. అర్ధ శతకానికి చేరువైన రవీంద్రను .. చాప్‌మన్ ఔటయ్యాక కెప్టెన్ శాంట్నర్(47 నాటౌట్) ధనాధన్ ఆటతో దడపుట్టించాడు. డెత్ ఓవర్లలో బౌండరీలతో చెలరేగిన కివీస్ సారథి.. జకరీ ఫౌల్క్‌స్(15 నాటౌట్)తో కలిసి 19 బంతుల్లోనే 47 రన్స్ జోడించాడు. దాంతో.. భారత్‌పై టీ20ల్లో న్యూజిలాండ్ రికార్డు స్కోర్ చేసింది. ఇదివరకూ 2017లో నమోదు చేసిన 196/2 అత్యధికంగా ఉండేది.

## బంగ్లాదేశ్ విషయంలో జై షా సంప్రదింపులు


2026 పురుషుల టీ20 ప్రపంచ కప్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో పర్యటించకుంటే అంతర్జాతీయ క్రికెట్ మండలి చైర్మన్ జై షా కఠిన చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నారని ఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే విషయంపై ఐసీసీ చైర్మన్ దుబాయ్ వేదికగా సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించాయి. బంగ్లాలో హిందువులపై నేరాలు పెరిగిన వేళ బీసీసీఐ సూచనతో ఇటీవల బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను ఐపీఎల్ 2026 జట్టు నుంచి కేకేఆర్ తొలగించింది. అప్పటినుంచి భారత్ పై బీసీబీ అక్కసు పెంచుకుంది. తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన సమస్యలు




ఉన్నాయనీ టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్ వెలుపల శ్రీలంకలో నిర్వహించాలని కోరగా ఐసీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. భారత్?లో బంగ్లా జట్టు, మ్యాచ్ వేదికలకు బీసీబీ చెప్పినట్లు ఎలాంటి ముప్పు గుర్తించలేదని ఐసీసీ పేర్కొంది. ఐసిసి విజ్ఞప్తిని తిరస్కరించిన తర్వాత స్పందించిన బీసిబీ చీఫ్ అమీనుల్ ఇస్లాం భారత్?లో ఆడలేమని మరోసారి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ఐసీసీ చీఫ్ జైషా నిర్ణయం ఏ నిర్ణయం తీసుకుంటారోన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

## ఆరెంజ్ క్యాప్ రేసులో హర్మన్‌ప్రీత్.. పర్పుల్ క్యాప్ పట్టేసేది ఎవరు..?

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ప్లే ఆఫ్స్ బెర్తులే కాదు ఆరెంజ్ క్యాప్( పర్పుల్ క్యాప్ రేసు కూడా ఉత్కంఠ రేపుతోంది. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులతో, అత్యధిక వికెట్లతో మ్యాచ్ విన్నర్లుగా అవతరించిన స్టార్లు ఎవరంటే.. ముంబై



ఇండియన్స్‌ను రెండుసార్లు విజేగా నిలిపిన హర్మన్‌ప్రీత్ కౌర్ 240 రన్స్‌తో పోటీలో ఉంది. పర్పుల్ క్యాప్ రేసులో సోఫీ డెవినె అగ్రస్థానంలో ఉంది. డబ్ల్యూపీల్ చరిత్రలో నాలుగో హ్యాట్రిక్ తీసిన నందినీ శర్మ 10 వికెట్లతో పోటీలో నిలిచింది.ఆరంభంలో తడబడిన ముంబైని విజయాల బాట పట్టించిన హర్మన్‌ప్రీత్ ఆరెంజ్ క్యాప్ కోసం పోటీపడుతోంది. ఆరు మ్యాచుల్లో రెండు అర్ధ శతకాలు బాదిన ముంబై సారథి 60.00 సగటు, 143.871 స్ట్రయిక్ రేటుతో రెండో స్థానంలో కొనసాగుతోంది. వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో భారత్‌పై సెంచరీతో మెరిసిన ఆస్ట్రేలియా అమ్మాయి ఫొబే లిచ్‌ఫీల్డ్ (ఫ్రాష్ట్రశీఎవ రాఙఎష్ట్రటఅశ్రీవఎ) అగ్రస్థానంలో ఉంది.యూపీ వారియర్స్ విజయాల్లో కీలకం అవుతున్న ఈ చిచ్చరపిడుగు.. ఆరు మ్యాచుల్లో 243 పరుగులతో టాప్‌లో ఉంది. ముంబై ఇండియన్స్‌కే చెందిన నాట్ సీవర్ బ్రంట్.. 219 రన్స్‌తో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ హిట్టర్ లిజెల్లీ లీ మూడు హాఫ్ సెంచరీలతో కలిపి 213 పరుగులతో నాలుగో ప్లేస్‌లో ఉండగా.. యూపీ సారథి మేగ్ లానింగ్ 207 రన్స్‌తో ఐదో స్థానం సాధించింది.

**పర్పుల్ క్యాప్ బరిలో..**

అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు లభించే పర్పుల్ క్యాప్ రేసులో కూడా పోటీ తీవ్రంగా ఉంది. నాలుగో సీజన్‌లో హ్యాట్రిక్‌తో చెలరేగిన ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ నందినీ శర్మ 10 వికెట్లతో గట్టి పోటీనిస్తోంది. అయిటే.. గుజరాత్ జెయింట్స్ ఆల్‌రౌండర్ సోఫీ డెవినె 11 వికెట్లతో నంబర్ 1 ర్యాంక్‌లో ఉంది. అయితే.. రెండో స్థానంలో ఉన్న నలుగురూ 10 వికెట్లు తీయడం విశేషం.ఆర్సీబీ సంచలనం నడినే డీక్లెర్క్, ముంబై స్టార్ అమేలియా కేర్.. పదేసి వికెట్లతో పోటీలో నిలిచారు. ఈ సీజన్‌లో పవర్ ప్లే క్వీన్‌గా అవతరించిన లారెన్ బెల్ 5 మ్యాచుల్లో 9 వికెట్లతో ఐదో ర్యాంక్ సాధించింది. బౌలింగ్ సగటు విషయానికొస్తే ఆర్సీబీ పేసర్ సయాలీ సత్ఘరే 8.00తో అగ్రస్థానం దక్కించుకుంది. బెల్ 12.00తో రెండో స్థానంలో కొనసాగుతోంది.